ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -212 | పేజీలు - 8 | వెల - 03/- | సోమవారం 10 నవంబర్ 2025

# అనారోగ్యమే అసలైన పేదరికం




## ఇంటి వద్దకే ప్రపంచస్థాయి వైద్యం అందించే 'సంజీవని' ప్రాజెక్టు : సీఎం చంద్రబాబు

- ఎన్ని ఉన్నా ఆరోగ్యం లేకపోతే వ్యర్థం...
- శంకర ఐ కేర్ భవనాన్ని ప్రారంభించిన సీఎం
- గుంటూరు పెదకాకానిలో శంకర కంటి ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం
- రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తామని వెల్లడి
- ఆరోగ్య రంగంలో ఏపీని ప్రపంచానికి రోల్ మోడల్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా
- అనారోగ్యమే అసలైన పేదరికం అని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి
- శంకర ఫౌండేషన్ సేవలను కొనియాడిన సీఎం.. 30 లక్షల మందికి ఉచిత సర్జరీలు

గుంటూరు**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-** గుంటూరు జిల్లా పెదకాకాని వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'శంకర ఐ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని' ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మానవాళికి, ముఖ్యంగా పేదలకు శంకర ఐ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అద్భుతమని, అమోఘమని ప్రశంసించారు. అవసరమైన వారికి దృష్టిని ప్రసాదిస్తూ ఆ సంస్థ చేస్తున్న కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. స్వామీజీ సమక్షంలో ఈ సూపర్ స్పెషాలిటీ కేంద్రాన్ని ప్రారంభించటం తన అదృష్టంగా భావిస్తున్నానని చంద్రబాబు పేర్కొన్నారు. జగద్గురు శ్రీ ఆది శంకరాచార్యులు తమిళనాడులో స్థాపించిన కంచి పీఠం.. ధర్మం, జ్ఞానం, సేవ అనే మూడు మూల సిద్ధాంతాలపై పనిచేస్తోందని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. మిగతా 2లో.






# 'ఒక్క ఛాన్స్' పొరపాటువద్దు




- : బీహార్ ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు
- బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి నారా లోకేశ్
- అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఎంతో అవసరమని వ్యాఖ్య
- ఏపీలో వైసీపీకి ఛాన్స్ ఇవ్వడంతో పరిశ్రమలు వెనక్కి వెళ్లాయని ఆరోపణ
- నితీశ్ కుమార్ పాలన కొనసాగాలని బీహార్ ప్రజలకు విజ్ఞప్తి

2లో.

# అనధికారికంగా మీటర్లు బిగింపు ...




- వ్యక్తిగతంగా వసూలు చేస్తున్న విద్యుత్ అధికారులు...
- వీటి ముడుపుల లెక్కలను విద్యుత్ శాఖ తేలుస్తుందా..?
- అడ్డదారిలో నష్టం వాటిల్లుతున్నా మత్తు వదలని శాఖ...

8లో.

## ఏనుగులదాడుల నివారణకు
# హనుమాన్

- ఏనుగుల సంచారంపై ఎప్పటికప్పుడు సమాచారం
- 150 ఏనుగులకు జియో ట్యాగింగ్: పవన్
- చిత్తూరు జిల్లాలో 'కుంకీ' కేంద్రం ప్రారంభం

చిత్తూరు/**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-** అడవి ఏనుగుల దాడుల నివారణకు అటవీశాఖ రూపొందించిన హనుమాన్ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఆదివారం చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ ప్రాజెక్టు పోస్టర్‌ను ఆవిష్కరించారు. 11 అంశాలతో కూడిన ఈ ప్రాజెక్టు గురించి అటవీశాఖ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వాటిని ఆసక్తిగా తెలుసుకున్న ఆయన, అటవీ శాఖతో పాటు పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు మిగతా 2లో.



### 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో
# మెగా ఆపరేషన్...
## రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్

- ఏపీ సహా పలు రాష్ట్రాల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- దేశవ్యాప్తంగా 754 కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- మొత్తం రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ముఠా
- నిందితుల ఖాతాల్లోని కోట్లాది రూపాయలు ఫ్రీజ్
- డబ్బును బాధితులకు తిరిగి అందజేస్తామన్న పోలీసులు



2లో.

# రాబోయే పది రోజులు గజగజే!

## మరింత పెరగనున్న చలి తీవ్రత
## 11-19 తేదీల్లో పలు జిల్లాల్లో 10 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-** తెలంగాణలో చలిపులి ఇప్పటికే మొదలైంది. రాత్రి ఉష్ణోగ్రతలు రోజురోజుకి పడిపోతున్నాయి. మూడు నాలుగు రోజుల వ్యవధిలోనే కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18-20 డిగ్రీల నుంచి 9-13 డిగ్రీల మధ్యకు చేరుకున్నాయి. అయితే, రాబోయే పది రోజుల్లో చలి తీవ్రత మరింత పెరగబోతుంది. అవును.. నవంబరు 11-19 తేదీల వరకు అనగా రాబోయే పది రోజుల్లో రాష్ట్రంలో చలి తీవ్రత అధికంగా ఉండనుందని తెలంగాణ ప్రణాళిక అభివృద్ధి సంఘం ఆదివారం హెచ్చరించింది. ముఖ్యంగా 13-17 తేదీల మధ్య మరింత అధికంగా ఉంటుందని, కొన్ని జిల్లాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రతలు మిగతా 2లో.



# సెంటిమెంటా? డెవలప్‌మెంటా?

'మీట్ ద ప్రెస్'లో సీఎం రేవంత్‌రెడ్డి

## జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి

- జూబ్లీహిల్స్ కేసీఆర్ ఓట్లడగలేదేం
- రానున్న పదేళ్లలో వందేళ్ల అభివృద్ధి చేసి చూపిస్తాం
- కేసీఆర్ పెట్టిన ఏ పథకాన్నీ ఆపలే
- గుజరాత్‌కు గులాముగా కిషన్‌రెడ్డి
- కేటీఆర్‌తో చెడు సావాసాన్ని ఆపాలి

హైదరాబాద్, **నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-** బీఆర్‌ఎస్ కాలగర్భంలో కలిసిపోతున్న పార్టీ అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ వ్యాలిడిటీ పీరియడ్ అయిపోయిందన్నారు. ఇదేమీ తాను రాజకీయ విమర్శ కోసం చెబుతున్నది కాదని, ఒకప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ ఇప్పుడు ఇక్కడ లేకుండా పోయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌తోనే ఆ పార్టీ పని అయిపోతుందన్నారు. మిగతా 2లో.



# ‘ఒక్క ఛాన్స్’ పొరపాటువద్దు

## : బీహార్ ఓటర్లకు నారా లోకేశ్ పిలుపు

**పాట్నానవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-**

బీహార్ రాష్ట్ర అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగాలంటే, అక్కడ మరోసారి ఎన్డీయే ప్రభుత్వానికే పట్టం కట్టాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్య శాఖ మంత్రి నారా లోకేశ్ ఆ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఒకే కూటమి అధికారంలో ఉండే ‘డబుల్ ఇంజిన్ సర్కార్’తోనే ఇది సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ ప్రచారానికి చివరి రోజైన ఆదివారం నాడు ఆయన పాట్నాలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ప్రస్తుతం బీహార్ అభివృద్ధి పథంలో దూసుకెళుతోందని, ఇలాంటి కీలక సమయంలో ప్రభుత్వ మార్పు జరిగితే మొత్తం ప్రక్రియ గాడి తప్పుతుందని లోకేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన రాజకీయ తప్పిదాన్ని ఆయన ఉదాహరణగా చూపించారు. “మా రాష్ట్రంలో ‘ఒక్క ఛాన్స్ ఇవ్వండి’ అంటూ వైసీపీ అధికారంలోకి వచ్చింది. వారు పాలన చేపట్టిన తర్వాత అనేక పరిశ్రమలు రాష్ట్రాన్ని విడిచి వెళ్లిపోయాయి. పెట్టుబడులు ఆగిపోయాయి. ఈ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని బీహార్ ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాలి” అని లోకేశ్ హితవు పలికారు.

“బీహార్ అభివృద్ధికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం చాలా అవసరం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కలిసి పనిచేస్తేనే బీహార్ కలలు సాకారమవుతాయి. ప్రస్తుతం అభివృద్ధి అనే విమానం రన్‌వేపై టేకాఫ్ కోసం సిద్ధంగా ఉంది. ఇది ఆగిపోవాల్సిన సమయం కాదు. అందుకే, మా కూటమికి ఐదోసారి అధికారం ఇవ్వండి. మేమంతా కలిసి రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు.

నితీశ్ కుమార్ ముఖ్యమంత్రి కాకముందు బీహార్‌లో ‘జంగిల్ రాజ్’ నడిచిందని లోకేశ్ గుర్తుచేశారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చిన తర్వాతే రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. “నేను పాట్నాలోని పారిశ్రామికవేత్తలతో మాట్లాడాను. ఇక్కడి ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి పనులపై వారు ఎంతో సంతోషంగా ఉన్నారు. కేంద్ర బడ్జెట్‌లో బీహార్‌కు అత్యధిక నిధులు కేటాయించారు. ఆ తర్వాత స్థానంలో ఆంధ్రప్రదేశ్ ఉంది. రెండు రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉండటం వల్లే ఇది సాధ్యమైంది” అని ఆయన వివరించారు.

ప్రధానంగా మూడు కారణాల వల్ల బీహార్‌లో ఎన్డీయే గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ నొక్కిచెప్పారు. నాయకత్వ పనితీరు, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం, ప్రభుత్వాల కొనసాగింపు అనేవి రాష్ట్ర పురోగతికి కీలకమన్నారు. ‘వికసిత భారత్’ లక్ష్యాలను చేరుకోవడంలో బీహార్ పాత్ర చాలా ముఖ్యమైనదని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి కోసం యువత ఎన్డీయే విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ పర్యటనలో భాగంగా లోకేశ్ బీహార్ ఇండస్ట్రీస్ అసోసియేషన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతోనూ సమావేశమయ్యారు. రాష్ట్రాలు బలపడినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని, సరైన సమయంలో దేశ ప్రజలు సరైన నాయకుడిని ప్రధానిగా ఎన్నుకున్నారని, ఫలితంగా గత దశాబ్ద కాలంలో భారత్ అపూర్వమైన అభివృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు.

# అనారోగ్యమే అసలైన పేదరికం

ఆనాటి నుంచి నేటి వరకు హిందూ ధర్మ పరిరక్షణకు కంచి పీఠం ఎంతో కృషి చేస్తోందన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఆది శంకరాచార్యులు దేశంలోని నాలుగు ప్రాంతాల్లో నాలుగు పీఠాలను స్థాపించిన విషయాన్ని ప్రస్తావించారు. ‘మానవ సేవే మాధవ సేవ’ అనే సిద్ధాంతాన్ని బలంగా నమ్మే కంచి పీఠం, దేశవ్యాప్తంగా కంటి ఆసుపత్రులు స్థాపించి పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించడం గొప్ప విషయమని అన్నారు.శంకర ఐ ఫౌండేషన్ సాధించిన విజయాలను చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. ఐదు దశాబ్దాల ప్రస్థానంలో దేశంలోని 10 రాష్ట్రాల్లో 14 కంటి ఆసుపత్రులను నిర్మించి, విజయవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. ఇప్పటివరకు 30 లక్షల మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు, 70 లక్షల మంది చిన్నారులకు కంటి పరీక్షలు చేయడం సాధారణ విషయం కాదన్నారు. ఈ ఆసుపత్రుల్లో రోజుకు సగటున 750 ఉచిత కంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని తెలిసి తాను ఆశ్చర్యపోయానని, ఇది మరే ఇతర సంస్థకు సాధ్యం కాని ప్రజా సేవ అని కొనియాడారు. కేవలం భారతదేశంలోనే కాకుండా నేపాల్, కాంబోడియా, నైజీరియా వంటి దేశాల్లోనూ సేవలందిస్తుండటం ప్రశంసనీయమన్నారు. ‘గిఫ్ట్ ఆఫ్ విజన్’ అనే గ్రామీణ సేవా ప్రాజెక్ట్ కింద 32,000కు పైగా కంటి శిబిరాలు నిర్వహించడం వారి నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.నూతనంగా ప్రారంభించిన ఈ సూపర్ స్పెషాలిటీ ఐ కేర్ బ్లాక్‌తో మన రాష్ట్రంలో ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని, దీని ద్వారా ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నిండుతాయని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా ‘రెయిన్‌బో ప్రోగ్రామ్’ ద్వారా చిన్నారుల కంటి ఆరోగ్యంపై దృష్టి సారించడాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా తమ ప్రభుత్వ లక్ష్యాలను కూడా చంద్రబాబు వివరించారు. ‘ఆరోగ్యాంధ్రప్రదేశ్’ నిర్మాణంలో భాగంగా ‘హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ’ అనేది తమ ప్రభుత్వ విధానమని స్పష్టం చేశారు. అనారోగ్యమే నిజమైన పేదరికం అని, అందుకే ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ఉద్ఘాటించారు. ప్రజారోగ్య సంరక్షణకు వినూత్న కార్యాచరణ అమలు చేస్తున్నామని, త్వరలోనే యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకురానున్నామని ప్రకటించారు. ప్రముఖ టాటా సంస్థ సహకారంతో డిజిటల్ నెర్వ్ సెంటర్ ‘సంజీవని’ కేంద్రాలను త్వరలో రాష్ట్రమంతటా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రజల ఆరోగ్యం కాపాడటానికి శంకర ఐ హాస్పిటల్స్ వంటి సంస్థల సేవలను మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నానని అన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి పనిచేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పేదలకు సేవ చేసే సంస్థలకు తమ సహకారం సంపూర్ణంగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో శంకర ఐ ఆస్పత్రి నిర్వహించే స్వర్ణోత్సవాల్లో తాను కూడా పాల్గొంటానని ఆయన ఆకాంక్షించారు.

# సెంటిమెంటా? డెవలప్‌మెంటా?

కేసీఆర్‌కు గతమే తప్ప.. భవిష్యత్తు లేదని, ఆ బాధతోనే ఆయన బయటికి రావడంలేదని వ్యాఖ్యానించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఆ పార్టీ అభ్యర్థికి ఓటేయాలని నియోజకవర్గ ప్రజలకు ఈనాటి వరకూ కేసీఆర్ విజ్ఞప్తి చేయకపోవడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. “బయటికి వచ్చి ప్రచారం చేయడానికి ఆరోగ్య సమస్యలు ఉండవచ్చు. కానీ, పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కూడా విజ్ఞప్తి చేయడంలేదంటే కేటీఆర్, హరీశ్‌రావుపై ఆయనకున్న ఆలోచనేంటో అర్థం చేసుకోవచ్చు” అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆయన కళ్లముందు పార్టీ కూలిపోతుంటే కుమిలిపోతున్నారని, దుఃఖం, ఆవేదనతో కాలక్షేపం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను ప్రత్యర్థిగా కాకుండా సానుభూతితో చూడాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ‘మీట్ ద ప్రెస్’ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఆత్మహత్య చేసుకుని మరీ బీజేపీకి అవయవదానం చేసిందని ఆరోపించారు. దాంతో బీజేపీ గెలుచుకున్న 8 సీట్లే మోదీ మూడోసారి ప్రధాని కావడానికి ఉపయోగపడ్డాయన్నారు. బీజేపీలో బీఆర్‌ఎస్ విలీన ప్రక్రియ మొదలైందంటూ కేసీఆర్ కూతురు కవితే స్వయంగా చెప్పారని గుర్తు చేశారు.

కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగించి మూడు నెలలు గడిచినా ఇంతవరకు విచారణ ప్రారంభం కాలేదని, సీబీఐ కాళ్లకు బంధం వేస్తున్నది ఎవరని ప్రశ్నించారు. అలాగే ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకూ గవర్నర్ నుంచి అనుమతి రాలేదన్నారు. సొంత చెల్లిని, మాగంటి తల్లిని కేటీఆర్ అవమానించారని ఆరోపించారు. మహిళలకు రక్షణ కల్పించలేని కేటీఆర్.. ప్రజల అభిమానం ఎలా చూరగొంటారని ప్రశ్నించారు. కేసీఆర్ ధృతరాష్ట్రుడిలాగా పిల్లల దుర్మార్గాలను భరిస్తున్నారని వ్యాఖ్యానించారు. తనది కార్యకర్త మనస్తత్వమని, హుజూరాబాద్, హుజూర్‌నగర్, సాగర్, మునుగోడు ఉప ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ కంటే ఎక్కువగా ప్రచారం చేశానని తెలిపారు. 2034 జూన్ వరకు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని, దీనిని రాసిపెట్టుకోవచ్చని ప్రకటించారు. రాబోయేవి జమిలి ఎన్నికలు అని, 2028 డిసెంబరుకు బదులుగా.. 2029 జూన్‌లో జరుగుతాయని అన్నారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే విజయం సాధించి 2034 జూన్ వరకూ అధికారంలో కొనసాగుతుందని జోస్యం చెప్పారు. ఈ పదేళ్లలో.. వందేళ్ల అభివృద్ధి చేస్తామన్నారు.



2004 నుంచి 2014 వరకు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ.. రైతుల సంక్షేమం కోసం కృషి చేసిందని సీఎం రేవంత్ తెలిపారు. హైదరాబాద్ నగరానికి గోదావరి నీళ్లు రావడానికి సీఎల్పీ నేతగా పీజేఆర్ నడిపిన పోరాటమే కారణమన్నారు. ఐటీ, ఫార్మా, నాలెడ్జ్ హబ్‌గా హైదరాబాద్ మారిందంటే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రత్యేక పాలసీల వల్లనేనని పేర్కొన్నారు. జంటనగరాలకు నిరంతర విద్యుత్తు ఇవ్వాలని విధాన పరమైన నిర్ణయం తీసుకోవడంతో దిగ్గజ ఐటీ సంస్థలు తరలి వచ్చాయన్నారు. దేశానికి సరఫరా అవుతున్న బల్క్ డ్రగ్స్‌లో 40 శాతం హైదరాబాద్‌లో ఉత్పత్తి అవుతున్నవేనని చెప్పారు. పదేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన ప్రణాళికలు, విధానపరమైన నిర్ణయాల కారణంగా వచ్చిన ప్రపంచ దిగ్గజ సంస్థలు.. హైదరాబాద్‌కు గ్రోత్ ఇంజన్లుగా మారాయన్నారు. తెలంగాణలో 65 శాతం ఆదాయం హైదరాబాద్ నగరం నుంచే వస్తోందని వెల్లడించారు. ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను తీసుకువచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం బ్యాలెన్స్ చేసిందన్నారు. ఈ చరిత్ర కేసీఆర్ చెరిపేస్తే చెరిగేది కాదన్నారు. ఆనాటి పదేళ్ల కాంగ్రెస్ పాలన, ఆ తర్వాత కేసీఆర్ పదేళ్ల పాలనతో పోల్చి చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రాబోయే పది రోజులు గజగజే!

పది డిగ్రీల లోపునకు పడిపోనున్నాయని పేర్కొంది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో 10 డిగ్రీలోపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. సోమవారం నుంచి బుధవారం వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు 9-15 డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. ముఖ్యంగా ఆసిఫాబాద్, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు 9-10 డిగ్రీల మధ్య నమోదవుతాయని వెల్లడించింది. ఆ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఇక, మిగిలిన జిల్లాల్లో 11-15డిగ్రీల మధ్య నమోదు అవుతాయని వెల్లడించింది. అలాగే, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 26-30డిగ్రీల మధ్య నమోదవుతాయని పేర్కొంది. కాగా, శనివారంరాత్రి ఆదిలాబాద్ జిల్లా అర్లీ(టీ)లో 14.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.విశాఖపట్నం: పసిఫిక్ మహాసముద్రం నుంచి వచ్చే తేమగాలుల ప్రభావంతో ఈ నెల 19 లేదా 20న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. తర్వాత పశ్చిమంగా పయనించే క్రమంలో ఇది బలపడి తుపానుగా మారుతుందని ఇస్రో వాతావరణ నిపుణుడు వెల్లడించారు. అనంతరం ఇది ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తా దిశగా రానుందని అంచనావేశారు. దక్షిణ కోస్తా జిల్లాలపై దీని ప్రభావం ఉంటుందని విశ్లేషించారు. దీని కంటే ముందుగానే శ్రీలంక సమీపంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి

# ఏనుగులదాడుల నివారణకు హనుమాన్

దీనిపై చర్చించేందుకు ఈ నెల 3వ వారంలో సమీక్ష ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. మానవ, వన్య ప్రాణి సంఘర్షణను తగ్గించేందుకు ఇప్పటికే అమల్లో ఉన్న గజ యాప్ స్థానంలో నూతన సాంకేతికతతో ప్రత్యేక యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. ఏ ప్రాంతంలో ఏనుగులకు రేడియో కాలర్ ఏర్పాటు చేస్తే అత్యధిక ప్రయోజనం ఉంటుందో వాటికే ఏర్పాటు చేయాలని సూచించారు. జంతువుల సంచార సమాచారం ప్రజలకు తెలిసేలా అధునాతన టెక్నాలజీతో కొత్త యాప్‌ను రూపొందించి మార్చి 3లోగా అందుబాటులోకి తేవాలన్నారు. ఏనుగులతో తీవ్రంగా దెబ్బతింటున్న పంటల స్థానంలో ప్రత్యామ్నాయాలు ఎలా.. ఇందుకు రైతుల్ని ఎలా ఒప్పించాలనే అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. సర్ప మిత్ర వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందించాలన్నారు.

మదపుటేనుగుల్ని అడవిలోకి తరిమి కొట్టేందుకు కర్ణాటక నుంచి ఆ మధ్య పవన్ నాలుగు కుంకీ ఏనుగుల్ని తీసుకొచ్చిన విషయం తెలిసిందే. చిత్తూరు జిల్లా పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల్లో 140-150 వరకు ఏనుగులు ఉన్నాయని అధికారులు చెప్పగా.. వాటన్నింటికీ జియో ట్యాగింగ్ చేయాలని పవన్ సూచించారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న గజారామం నగర వనానికి, మియావకీ ఫారెస్టు ప్లాంటేషన్, అధునాతన సోలార్ ఫెన్సింగ్ తదితర వాటికి శిలాఫలకాలను ఆవిష్కరించారు.

ఎలిఫెంట్ క్యాంపులో కుంకీ ఏనుగుల ప్రత్యేక విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పవన్ ఆసక్తిగా తిలకించి తన సెల్‌ఫోన్‌లో రికార్డు చేసుకున్నారు. ఏనుగులు వరుసగా ఘీంకరిస్తూ పవన్‌కు సెల్యూట్ చేశాయి. వివిధ రకాల కలపను అడవిలో నుంచి ఎలా బయటికి తీసుకొస్తారో కుంకీలతో చేసి చూపించారు. కుంకీ ఏనుగులకు పవన్ ఆహారాన్ని అందించారు. వాటి సంరక్షణ చూసే మావటీలతో ఫొటో తీసుకుని రూ.50 వేలు బహుమతి అందించారు.

మదపుటేనుగులు అదుపు తప్పినప్పుడు వాటికి ఓ ప్రత్యేకమైన మత్తు ఇచ్చి వాటి కోపాన్ని ఎలా అణచివేస్తారనేది మావటీలు పవన్‌కు చూపించారు. ఈ సందర్భంగా మత్తు ఇచ్చే ఇంజక్షన్ గన్‌ను పట్టుకుని పవన్ ఆసక్తిగా పరిశీలించారు.

# 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

## రూ.95 కోట్లు మోసం చేసిన 81 మంది అరెస్ట్

తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు.నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

# జూబ్లీ బైపోల్‌లో ముగిసిన ప్రచారం

**మూగబోయిన మైకుల మోత, ప్రచార సందడి**

**అమల్లోకి ఎన్నికల ఆంక్షలు%రేపే పోలింగ్**

**సంక్షేమ పథకాలు, అభివృద్ధే నినాదంగా ప్రజల్లోకి కాంగ్రెస్**

**కాంగ్రెస్ వైఫల్యాలే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రచారం**

**రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తించిన పార్టీలు**

**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-**

జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల హోరాహోరీ ప్రచారానికి ఆదివారం సాయంత్రం 6 గంటలతో తెరపడింది. దాంతో పార్టీల ప్రచార వాహనాల సందడి, నాయకుల ప్రసంగాలు, కార్యకర్తల నినాదాలతో మార్మోగిన వీధులు ఒక్కసారిగా నిశ్శబ్దంగా మారాయి. ర్యాలీలు, రోడ్ షోలు, కార్నర్ మీటంగ్‌ల హడావుడి ముగిసింది. గడిచిన ఇరవై రోజులుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీ, కాలనీల్లో అన్ని పార్టీల ముఖ్య నేతలు వివిధ రూపాల్లో తమ ఎన్నికల ప్రచారంతో హోరెత్తించాయి. ఇక ప్రచారానికి తెరపడటంతో ఎన్నికల ఆంక్షలు అమల్లోకి రాగా.. ఇక అందరి దృష్టి రేపటి పోలింగ్‌పైనే నిలిచింది. ఓటర్లు తమ తీర్పును ఈవీఎంలలో నిక్షిప్తం చేయనుండగా, అభ్యర్థుల భవితవ్యం ఈనెల 14న వెలువడనున్న ఓట్ల లెక్కింపుతో తేలనుంది.ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ.. చివరి రోజు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. అధికార కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని నినాదంగా చేసుకుని ఓటర్లను అభ్యర్థించింది. ముఖ్యంగా డివిజన్‌ల వారీగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, జూపల్లితో పాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మెన్లు ఇంటింటి ప్రచారంలో పాల్గొని ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, స్థానిక నాయకులు, అభ్యర్థి నవీన్ యాదవ్‌తో కలిసి రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో ప్రచారాన్ని హోరెత్తించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తానే తీసుకుంటానని, అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, తెల్ల రేషన్ కార్డులు మంజూరు చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. మరోవైపు ప్రతిపక్ష బీఆర్‌ఎస్.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను లక్ష్యంగా చేసుకుని ప్రచారం సాగించింది.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు.. తమ ప్రసంగాల్లో అధికార పార్టీపై విమర్శలు గుప్పించారు. కేటీఆర్ రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొని, పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనతో రెండేండ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేసుకోవాలని ప్రజలను కోరారు. హరీశ్ రావు తండ్రి మరణించినప్పటికీ.. ప్రచార బాధ్యతల్లో కేటీఆర్‌కు అండగా నిలిచారు. బీజేపీ కూడా తన ప్రచారాన్ని ముమ్మరంగా సాగించింది. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను విమర్శిస్తూ ప్రచారం చేసింది. ఇందులో భాగంగా బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారాలతో పాటు పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజరు, ఇతర సీనియర్ నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు. ప్రధాన పార్టీలన్నీ ఈ ఉప ఎన్నిక ను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో ప్రచారం సాధారణ ఎన్నికల వాతావరణాన్ని తలపించింది. ఇప్పుడు అందరి చూపు ఓటరు నాడీపైనే నిలిచింది. రేపు పోలింగ్ కేంద్రా లకు తరలివచ్చి తమ నిర్ణయాన్ని వెల్లడించనున్నారు. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీతో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచిన సంగతి తెలిసిందే.



వైద్యాధికారి భావన రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం



వైద్యాధికారి దినేష్ బాబును సన్మానిస్తున్న నిర్వాహకులు



రక్తదానం చేసిన నారాయణపురం సెక్షన్ ఆఫీసర్ ఖాసీం నాయక్

# భళా ..బండిఆత్మకూరు యువత

## వందమందికి పైగా రక్తదానం - రోషన్ ఆధ్వర్యంలో రికార్డు సృష్టించిన యువత

**బండిఆత్మకూరు, నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-**

బండిఆత్మకూరులో ఆదివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన రైతులు, రైతు కూలీలు, తాపీ మేస్త్రీ, విద్యార్థులు, స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేశారు. దీంతో ఒకే రోజు వందమందికి పైగా రక్తదానం చేశారు. బండిఆత్మకూరుకు చెందిన తాపీ మేస్త్రి రోషన్ రక్తదాన శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేయాలని బావించారు. ఈ విషయాన్ని తనతోటి స్నేహితులు, గ్రామస్థులకు తెలియజేయడంతో అందరు అంగీకరించారు. బండిఆత్మకూరు పోలీసు స్టేషన్ ఎదురూగా ఉన్న ఖాళీ స్థలంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణీ భావనారెడ్డి, నారాయణాపురం పీహెచ్‌సీ డాక్టరు దినేష్‌బాబు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు రక్తదానం చేయడంలో ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేశారు. రక్తదానం చేయడం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం 30 శాతం తగ్గుతుందని వివరించారు. తలసేమియా వ్యాధి గ్రస్తులకు నెలలో రెండు సార్లు రక్తం ఎక్కిస్తేనే వారి ప్రాణాలు కాపాడిన వారమౌతామని తెలిపారు. దీంతో రక్తాన్ని ఫ్యాక్టరీలలో ఎవరూ తయారు చేయలేరని తెలిపారు. కాబట్టీ మనమే రక్తదానం చేసి తలసేమియా , గర్భిణీ మహిళలు, రక్తం అవసరమున్న వారికి ఇచ్చి వారి ప్రాణాలను కాపాడాల్సిన బాద్యత అందరిపై ఉందన్నారు. దీంతో స్పందించిన గ్రామస్థులు స్వచ్ఛ్ఃదంగా తరలివచ్చి రక్తదానం చేశారు. నంద్యాల బ్లడ్ సెంటరు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. దీని నిర్వాహకుడు అచ్యూత్ మాట్లాడుతూ తాము ఆత్మకూరు నుంచి నంద్యాల వరకు ఎన్నో సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రక్తాన్ని సేకరిస్తున్నామని తెలిపారు. అయితే ఒకేసారి వందమందికి పైగా స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయడం ఇదే మొదటిసారి అని తెలిపారు. తాము తీసుకున్న రక్తంను ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత శ్యామల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అంతేకాక ఆగ్నే ఆర్టికల్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఓంకార దేవస్థానం కమిటీ డైరెక్టరు అయితా శేఖర్, కడపయ్యగారి సుబ్బారెడ్డి, ఎమ్మార్పీస్ జిల్లా నాయకుడు వెంకటసుబ్బన్న, ఐయూఎంఎల్ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా మస్తాన్, పరమటూరు సహకార సంఘం బ్యాంక్ సీఈవో గోపాల్, మాలిక్, గంగన్న, బాలస్వామి, శ్రీనివాసులు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ మోసాలపై జాగ్రత్త

## సోషల్ మీడియా యాడ్స్, లింక్స్ నమ్మొద్దని హెచ్చరిక

## కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్

**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ నవంబర్ 9)**

ఆన్‌లైన్ ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో ప్రజలను మోసం చేసే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ సూచించారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా తక్కువలో ఎక్కువ లాభాలు, గ్యారంటీ ప్రాఫిట్లు అంటూ వచ్చే యాడ్స్ నమ్మరాదని, లక్ష పెట్టి కోట్లు వస్తాయంటే ఖచ్చితంగా మోసమే అని స్పష్టంచేశారు.

నకిలీ పెట్టుబడి సంస్థలు, వెబ్‌సైట్లు, యాప్స్ ద్వారా కృత్రిమ లాభాలు చూపించి మరిన్ని నిధులు పెట్టమని ప్రలోభపెడుతున్నాయని తెలిపారు. ఇటీవల కర్నూలు ఎన్‌ఆర్‌పేటకు చెందిన వ్యక్తి ఇలాంటి ఇన్వెస్ట్‌మెంట్ లింక్‌లతో మోసపోయిన ఘటనను ఉదాహరణగా పేర్కొన్నారు.

**ఎస్పీ సూచనలు**

ఏదైనా ప్లాట్‌ఫారమ్‌లో పెట్టుబడి పెట్టే ముందు అది ఎస్ ఈ బి ఐ (భారత సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్) వద్ద రిజిస్ట్రేషన్ ఉన్నదో లేదో పరిశీలించాలి.

బ్యాంక్ వివరాలు, ఓటిపి లు, పాస్‌వర్డ్‌లు, యూపీఐ పిన్ నంబర్లు ఎవరితోనూ పంచుకోరాదు.

ప్రాసెసింగ్ ఫీజులు పేరుతో అడిగే చార్జీలను చెల్లించవద్దు.

అనుమానాస్పద లింకులు క్లిక్ చేయరాదు, ఏ పీ కె ఫైల్స్ ఇన్‌స్టాల్ చేయరాదు.



మోసానికి గురైన వారు టోల్‌ఫ్రీ నంబర్ 1930 కు కాల్ చేయవచ్చని, లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని ఎస్పీ తెలిపారు. బాధితుల సమాచారం గోప్యంగా ఉంచబడుతుందని హామీ ఇచ్చారు.

మీ డబ్బు %–% మీ భద్రత. పెట్టుబడి చేసేముందు పూర్తిగా ఆలోచించండి. మోసానికి గురైన ఇతరులకు కూడా 1930 నంబర్ సమాచారం అందించండి, అని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలి

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ నవంబర్ 9)**

జిల్లా పోలీసు అధికారులు నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రౌడీ షీటర్లు, నేరచరిత్ర గలవారు, చెడు నడత కలిగిన వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొని, సత్ప్రవర్తనతో జీవించాలనీ, నేరప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. నేరప్రవృత్తి మానుకుని సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అలాగే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు





# త్వరితగతిన బుధవారపేట మలుపు విస్తరణ పనులు

## ట్రాఫిక్ సౌకర్యం ప్రజా భద్రతకే ప్రాధాన్యత - కమిషనర్ పి. విశ్వనాథ్





**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ నవంబర్ 9)**

కర్నూలు నగరంలోని ట్రాఫిక్ సౌకర్యం, ప్రజా భద్రతను దృష్టిలో ఉంచుకొని బుధవారపేట మెడికల్ కాలేజీ మలుపు వద్ద రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన బుధవారపేట మలుపు ప్రాంతంలో స్వయంగా పరిశీలన చేసి, అడ్డంకిగా ఉన్న షాపులు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని వెంటనే రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలని, డ్రైనేజీ కాలువ అనుసంధానానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

కమిషనర్ మాట్లాడుతూ, 4.75 సెంట్లలో ఉన్న 7 షాపులను మసీదు కమిటీ సభ్యులు స్వచ్ఛందంగా తొలగించడం అభినందనీయం. ఆ ప్రదేశంలో రహదారి, డ్రైనేజీ కాలువ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దీని ఫలితంగా ట్రాఫిక్ సాఫీగా సాగేలా అవుతుంది, అని తెలిపారు.

అదేవిధంగా గాయత్రీ ఎస్టేట్ కూడలి కుదింపు పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయని, వాటిని త్వరలో పూర్తి చేస్తామని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. దశాబ్దాలుగా నిలిచిపోయిన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తున్నాం, అని అన్నారు.



కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ గిరిరాజ్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో పోలీసుల పటిష్ట భద్రతా చర్యలు

## అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా గస్తీలు, తనిఖీలు ముమ్మరం - ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్



**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ నవంబర్ 9)**

కర్నూలు జిల్లా వ్యాప్తంగా నేర నియంత్రణ, ప్రజా భద్రత పరిరక్షణ దిశగా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్ ఆదేశాల మేరకు అన్ని సబ్‌డివిజన్ల పరిధిలో పోలీసులు క్రమపద్ధతిలో గస్తీ విధులు నిర్వహిస్తూ, తనిఖీలను ముమ్మరం చేశారు.

అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ఓపెన్ డ్రింకింగ్ నియంత్రణ చర్యలు చేపట్టడంతో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు.

వాహనదారులకు రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ట్రాఫిక్ క్రమశిక్షణ పాటించాలని పోలీసులు సూచిస్తున్నారు. నేర నియంత్రణ, ప్రజా భద్రత కోసం అవసరమైన అన్ని చర్యలను పోలీసు విభాగం కఠినంగా అమలు చేస్తోంది.





# శ్రీశైలం వెళ్తుండగా కారు దగ్ధం.. తృటిలో ప్రాణాలతో బయటపడ్డ హైదరాబాద్ కుటుంబం

నాగర్‌కర్నూల్

శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్తున్న భక్తులు పెను ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. వారు ప్రయాణిస్తున్న కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో అది పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, అమ్రాబాద్ మండలం, కృష్ణగిరి (ఈగలపెంట) సమీపంలో చోటుచేసుకుంది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారంతా సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఆకుల



ప్రణవ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి కారులో శ్రీశైలం బయలుదేరారు. ఆయనతో పాటు భార్య, కుటుంబ సభ్యులు జయశ్రీ, తేజశ్రీ, శ్రీవల్లి, వాంగ్మయి ఉన్నారు. వారి వాహనం కృష్ణగిరి గ్రామ సమీపానికి రాగానే ఇంజిన్ నుంచి పొగలు రావడం మొదలైంది. దీన్ని గమనించిన ప్రణవ్‌కుమార్ వెంటనే అప్రమత్తమై కారును రోడ్డు పక్కన ఆపి, కుటుంబ సభ్యులందరినీ కిందకు దించేశారు. వారు కిందకు దిగిన కొద్దిసేపటికే కారు నుంచి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. చూస్తుండగానే కారు పూర్తిగా కాలి బూడిదైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. డ్రైవర్ అప్రమత్తత వల్లే పెను ప్రమాదం తప్పిందని ఎస్సై జయన్న తెలిపారు.

# ఘనంగా స్వచ్ఛా భారత్ కార్యక్రమం



**అనంతపురం ప్రతినిధి,నవంబర్ 09,( రిపబ్లిక్ న్యూస్):** రాజీవ్ చిల్డ్రన్ పార్క్ కమిటీ ఆధ్వర్యంలో హౌసింగ్ బోర్డులో రాజీవ్ చిల్డ్రన్ పార్క్ లో "స్వచ్ఛా భారత్ " కార్యక్రమాన్ని శనివారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ కమిటీ సభ్యులు, సీనియర్ సిటిజెన్ లు, వాకర్స్, యువకులు, ప్రతి ఒక్కరు పాల్గొని పార్క్ లో స్వచ్ఛ పార్క్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదే విధంగా కలుపు మొక్కలు, ప్లాస్టిక్ పేపర్ లు మొదలగు వాటిని చుట్టూ తొలగించారు. అందులో భాగంగా పార్క్ లో ప్రతి నెల మూడవ శనివారం రోజున ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్క్ కమిటీ అధ్యక్షులు లింగం నాయుడు, గౌరవ అధ్యక్షులు తిరుమల రెడ్డి, కమిటీ సభ్యులు బుగ్గయ్య చౌదరి, వర్ల శంకర్,రజక కార్పొరేషన్ డైరెక్ట్ పరమేష్,బిజెపి అశోక్ రెడ్డి,బొమ్మినేని శివ, సుధాకర్ యాదవ్, కుమారయ్య, బాలాజీ నాయక్,అశోక్ రెడ్డి,కేశవ రెడ్డి, గోపాల్, మనోహర్ రెడ్డి, నాగరాజు, వీర రెడ్డి, నారాయణ,మల్లీ నాయక్, దబ్బర వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వడ్డెర ఓసీసీఐ ఏపీ స్టేట్ కమిటీ సభ్యులు సన్మానం





**గుత్తి నవంబర్ 09 (రిపబ్లిక్ న్యూస్ )** అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని చెందినటువంటి ఓసీసీఐ ఏపీ స్టేట్ ప్రెసిడెంట్ లక్ష్మీ దేవమ్మ ఏపీ స్టేట్ ఆర్గనైజర్ జనరల్ సెక్రెటరీ బత్తల మారుతి ప్రసాద్ గుంటూరు నందు ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాలోని ఓసీసీఐ సభ్యులు, వడ్డెర బంధువులు కలిసి కొత్త గా నియామకం ఓసీసీసీఐ ఏపీ స్టేట్ కమిటీ సన్మానం చేయడానికి పిలవడం జరిగింది, ఈ కార్యమానికి,, ఓసీసీఐ నేషనల్ చీఫ్ అడ్వైసర్ డాక్టర్. గుంజి నరసింహారావు అధ్యక్షతన, ఓసీసీఐ నేషనల్ జాయింట్ సెక్రటరీ , సిహెచ్ లీలా భాను ప్రసాద్ హాజరై,, ఏపీ స్టేట్ ఓసీసీఐ ప్రెసిడెంట్ దేరంగుల లక్ష్మీదేవమ్మ , యు జగన్నాధం, లక్ష్మయ్య, ఏపీ స్టేట్ ఆర్గనైజయింగ్ జనరల్ సెక్రటరీ, బత్తల మారుతి ప్రసాద్ ను సన్మానించడం జరిగింది. అన్ని రాష్ట్రాలలో ని, దేశంలో వున్న వడ్డెరలను ఒక్కటిగా చేసి, వారిని, సామజిక, ఆర్థిక, ముక్యంగా రాజకీయ రంగంలో బలోపేతులను చేస్తామని చెప్పడం జరిగింది.

# శరవేగంగా సాగుతున్న రోడ్డు పనులు

**ఎమ్మెల్యే అమిలినేనికి కృతజ్ఞతలు తెలుపుతున్న వాహన దారులు, ప్రజలు**




**అనంతపురం రహదారులు, నవంబర్ 09,(రిపబ్లిక్ న్యూస్ ):** జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో చాలా వరకు గ్రామాలు కర్ణాటక ప్రాంతానికి సమీపాన ఉన్నాయి. ఇలాంటి గ్రామాలకు కనీస సౌకర్యంగా రోడ్డు వసతులు కూడా లేక ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఏళ్ల తరబడి రోడ్లు లేక సమీప గ్రామాల ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు.అలాంటి తరుణంలోఎన్నికల సమయంలో ప్రతి గ్రామానికి వెళ్లిన అమిలినేని సురేంద్ర బాబు అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామాలకు రహదారులు నిర్మిస్తానని మాట ఇచ్చారు. అందులో భాగంగానే ఇప్పటికే జిల్లాలోనే అత్యధికంగా రోడ్ల నిర్మాణానికి అనుమతులతో పాటు నిధులు తీసుకువచ్చి పనులను శరవేగంగా చేపడుతున్నారు. అందులో భాగమే కొలిమిపాళ్యం, జంబగుంపుల వైపు నుంచి కుందుర్పి మండల కేంద్రానికి దాదాపు రూ. 2.60 కోట్లతో తారు రోడ్డు నిర్మిస్తున్నారు. మిగిలిన రోడ్లు కూడా త్వరలోనే మొదలు కానున్నాయి. దీంతో ఎన్నో ఏళ్లుగా గుంతలు రహదారిలో నానా ఇబ్బందులు పడిన వాహనదారులు, ప్రజలు నేడు కొత్తగా నిర్మిస్తున్న రహదారిని చూసి సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు గారికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## ఎంపీ బస్తిపాటి నాగరాజు తో సమావేశామైన విద్యుత్ శాఖ ఎస్.ఈ



**ఓర్వకల్ ప్రతినిధి, నవంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం నాడు,ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలను అందించాలని ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు..నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ నాగరాజుతో విద్యుత్ శాఖ ఎస్.ఈ ప్రదీప్ కుమార్ సమావేశమయ్యారు...ఈ సందర్భంగా ఎస్.ఈ విద్యుత్ శాఖలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు..ఈ కార్యక్రమంలో రాష్ట్ర కురువ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

# వందేమాతరం నినాదాలతో స్కేటింగ్ ర్యాలీ

## కర్నూలు పట్టణంలో దేశభక్తి జ్వాల

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ నవంబర్ 9)** వందేమాతరం గీతాన్ని ఆలపిస్తూ కర్నూలు పట్టణంలో స్కేటింగ్ క్రీడాకారులు ఆదివారం ఉదయం దేశభక్తి ఉత్సాహంతో ర్యాలీ నిర్వహించారు.బంకిం చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గీతానికి 150 సంవత్సరాలు పూర్తి కావడం సందర్భంగా, ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు రాష్ట్ర రోలర్ స్కేటింగ్ సంఘం ఆదేశాలపై కర్నూలు జిల్లా రోలర్ స్కేటింగ్ సంఘం ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది.జాతీయ జెండాలు చేతపట్టి క్రీడాకారులు కర్నూలు స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నుండి కొండారెడ్డి బురుజు వరకు స్కేటింగ్ చేస్తూ దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు.ఈ కార్యక్రమంలో పలు పాఠశాలల స్కేటింగ్ క్రీడాకారులు, జిల్లా స్కేటింగ్ సంఘం సీఈఓ పి. సునీల్ కుమార్ కార్యదర్శి అబూ బాకర్, , సభ్యులు శిరీష్ బాబు, వీరేశ్, నారాయణ, హనుమంతు, అలాగే క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు.









# రాష్ట్రస్థాయి రెవెన్యూ పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉంది

**7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి**

**ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులకు అన్ని విధాలుగా అండగా ఉంటుందన్న దగ్గుపాటి**

**అనంతపురం క్రీడలు,నవంబర్ 09, (రిపబ్లిక్ న్యూస్):** నగరంలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించడం సంతోషంగా ఉందని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ఆర్డిటి స్టేడియం వేదికగా మూడు రోజులుగా జరుగుతున్న ఏడవ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా సాంస్కృతిక ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్ , సవితమ్మ, అనంతపురం జిల్లా కలెక్టర్,ఓ ఆనంద్ , అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి , అంతర్జాతీయ క్రీడాకారులు కిడంబి శ్రీకాంత్ , మైనేని సాకేత్, రెవెన్యూ అసోసియేషన్ సభ్యులతో కలసి పాల్గొన్నారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి రెవెన్యూ సిబ్బంది, అధికారులు అనంతపురం వచ్చి ఎంతో ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొన్నారన్నారు. అనంతపురంలో ఇంత పెద్ద కార్యక్రమం నిర్వహించేందుకు ముందుకొచ్చిన ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టిడి సంస్థ కూడా ఈ రెవెన్యూ పోటీలకు ఎంతో సహకారం అందించిందన్నారు. అత్యంత పని ఒత్తిడి ఉన్న విభాగాల్లో రెవెన్యూ శాఖ చాలా కీలకమైనదని.. వారు మూడు రోజుల పాటు అంతా కలిసి ఇలా క్రీడా పోటీల్లో పాల్గొనడం ఎంతో మానసికోల్లాసాన్నిచ్చిందన్నారు. రెవెన్యూ ఉద్యోగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే




ఉద్యోగులకు రావాల్సిన బకాయిలన్నీ ప్రాధాన్యత వారిగా చెల్లిస్తుందన్నారు. రానున్న రోజుల్లో వారికి ఇచ్చిన అన్ని హామీలు ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ స్పష్టం చేశారు.




# 9గంటల్లో 9999చీర బ్యాగుల పంపిణీ : ప్రపంచ రికార్డ్

**ప్లాస్టిక్ నిర్మూలన కోసం దగ్గుపాటి ఫౌండేషన్ చొరవ**

**డిస్కవరీ అనిల్, మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**టవర్ క్లాక్ వద్ద బ్యాగ్ లు పంపిణీ చేసిన దగ్గుపాటి అశ్రిత**

**లిప్లాస్టిక్ రహిత అనంత కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి..**

**దగ్గుపాటి అశ్రిత పిలుపు**

**4నెలల్లో 51వేల బ్యాగులు పంపిణీ చేశాం.. డిస్కవరీ అనిల్**

**ప్రజల సహకారం ఉంటేనే ప్లాస్టిక్ నిర్మూలించగలుగుతాం..**

**భవానీ రవికుమార్**



**అనంతపురం ప్రతినిధి, నవంబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):** ప్లాస్టిక్ రహిత అనంత కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని దగ్గుపాటి ఫౌండేషన్ ఛైర్మన్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుమార్తె దగ్గుపాటి అశ్రిత పిలుపునిచ్చారు. అనంతపురం నగరంలో దగ్గుపాటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకేరోజు ప్రపంచ రికార్డు సాధించేలా పదివేల చీర బ్యాగులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. దగ్గుపాటి ఫౌండేషన్ తో పాటు అనంతపురం డిస్కవరీ, అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టవర్ క్లాక్ వద్ద జరిగిన కార్యక్రమంలో దగ్గుపాటి అశ్రిత, డిస్కవరీ అనిల్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవానీ రవికుమార్ తో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ప్రజలకు ఉచితంగా చీర బ్యాగులు అందజేస్తూ ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని సూచించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా వ్యతిరేకించాలని కోరారు. ప్రజలు కూడా ఈ బ్యాగ్ లు తీసుకొని దగ్గుపాటి ఫౌండేషన్ చూపుతున్న చొరవను అభినందించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి ఆశ్రిత మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎవరూ వాడవద్దని విజ్ఞప్తి చేశారు. మానవాళికి ప్లాస్టిక్ అన్నది ఒక ప్రమాదకారిగా మారిందని.. దీని నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలన్నారు. దగ్గుపాటి ఫౌండేషన్ తరపున తమవంతుగా ఒకే రోజులో 9 గంటల్లో 9999 బ్యాగులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. 4గంటల్లోనే ఈ కార్యక్రమాన్ని పూర్తి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారం లేకుండా ప్లాస్టిక్ నిర్మూలన సాధ్యం కాదని.. ఇందుకోసం ప్రజల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్లాస్టిక్ నిర్మూలనలో తమ వంతుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. డిస్కవరీ అనిల్ మాట్లాడుతూ 4 నెలల క్రితం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని.. ఇప్పటికే 51 వేల బ్యాగులు అందజేసినట్లు తెలిపారు. ఇవాళ ఒక్కరోజే 140 మంది టైలర్లను ఏర్పాటు చేసి పదివేల బ్యాగులు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఇంట్లో ఒక పాత చీర ఉంటుందని దానిని ఉపయోగించి



ఇలాంటి బ్యాగులు తయారు చేసుకోవచ్చన్నారు. రానున్న రోజుల్లో ప్లాస్టిక్ రహిత కప్పులను కూడా తయారు చేస్తున్నట్లు చెప్పారు. స్వచంద్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవానీ రవికుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన కోసం ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజల సహకారం ఉంటేనే ప్లాస్టిక్ నిర్మూలించగలుగుతామన్నారు. ఇంటి నుంచి వచ్చేటప్పుడు ప్రతి ఒక్కరు బ్యాగ్ తెచ్చుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. అప్పుడే ప్లాస్టిక్ కవర్లు వాడకం తగ్గుతుందన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్ర వైపు నడిపించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దగ్గుపాటి ఫౌండేషన్ సభ్యులు బోయపాటి లావణ్య, కోనంకి స్నేహ, డిస్కవరీ అనంతపురం టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల ఐఎంఏ అకడమిక్ విభాగం నూతన కార్యవర్గం

## అధ్యక్షులుగా డాక్టర్ మల్లీశ్వరి, కార్యదర్శిగా డాక్టర్ లలిత, కోశాధికారిగా డాక్టర్ శశికిరణ్.

**నంద్యాల బ్యూరో, నవంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్):** ఇండియన్ మెడికల్ అసోసియేషన్ నంద్యాల శాఖ కు అనుబంధంగా ఉన్న అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా డాక్టర్ మల్లీశ్వరి, కార్యదర్శిగా డాక్టర్ జి. లలిత కుమారి, కోశాధికారిగా డాక్టర్ శశికిరణ్, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హిందూమతి, డాక్టర్ భారతి, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ గెలివి సిద్ధార్థ, డాక్టర్ మణిదీప్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్. ఎం.శ్రీనివాసులు,డాక్టర్ నాగరాజా రెడ్డి ,డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి ఎన్నుకోబడ్డారు. ఈ విభాగానికి,నంద్యాల ఐఎంఏ కు కోఆర్డినేటర్ గా డాక్టర్ సుసుమ వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా నూతన



అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖ కార్యవర్గానికి ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, నంద్యాల ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ మధుసూదనరావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర రెడ్డి,రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన్ రెడ్డి,డాక్టర్



అనిల్ కుమార్, డాక్టర్ లక్ష్మీ సౌజన్య,డాక్టర్ వసుధ, డాక్టర్ హరిత అభినందనలు తెలిపారు. అకాడమీ ఆఫ్ మెడికల్ స్పెషాలిటీస్ నంద్యాల శాఖ అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నుకోబడ్డ డాక్టర్ మల్లీశ్వరి, డాక్టర్ లలిత కుమారి మాట్లాడుతూ వైద్యులకు నిరంతర వైద్య



విద్యా కార్యక్రమాలు నిర్వహించి, వివిధ స్పెషాలిటీ విభాగాలలో వస్తున్న ఆధునిక వైద్య విధానాలు,నూతన పరికరాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. తద్వారా వైద్యులు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు.

## తిప్పాయిపల్లె గ్రామంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాలు





### వైసిపి పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

**ఓర్వకల్ ప్రతినిధి, నవంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం నాడు,ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలని కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించి, ఇంటింటి దగ్గరకు వెళ్లి ప్రజలందరికీ చేత సంతకాల సేకరణలో పాల్గొని, వైయస్సార్సీపి సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు అనంతరం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం పోస్టర్,నుఆవిష్కరించారు. కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ. ఈ రాష్ట్రంలో ప్రతి ఒక్క పేదవాడు ఇంగ్లీష్ మీడియం చదవాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వ స్కూలను నాడు నేడు కింద ప్రభుత్వ స్కూలను డెవలప్మెంట్ చేసిన ఘనత వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారిది. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి 17 మెడికల్ కాలేజీలు తీసుకువస్తే, చంద్రబాబు వాటిని ప్రవేటీకరణ చేయడం దారుణంమని తెలిపారు. ఎలక్షన్ల ముందర తెలుగుదేశం నాయకులు హామీలు ఇవ్వడం జరిగింది జగన్మోహన్ రెడ్డి గారు ఇచ్చే పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని చెప్పడం జరిగింది. ప్రజలందరూ కూడా మోస మాటలు నమ్మి ఓట్లేసి మోసపోవడం జరిగింది..అక్క చెల్లెలకు అందరికీ కూడా నెలకు 1500 ఇస్తామని చెప్పడం జరిగింది. సంవత్సరానికి 18 వేల రూపాయలు ఇస్తామని మోసం చేయడం జరిగింది..మా వైసీపీ ప్రభుత్వంలో సున్నా వడ్డీ , వైఎస్ఆర్ చేయూత ఇచ్చిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డిది. పేద ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను దూరం చేయాలన్న దురుద్దేశంతోనే కూటమి ప్రభుత్వం ఈ కుట్రలకు తెరతీసింది, దీనిని ఎంత మాత్రం సహించే ప్రసక్తే లేదు, అందులో భాగంగానే మననాయకుడు వైయస్ జగన్ పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందని పాణ్యం నియోజకవర్గంలో సైతం ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని సంతకాలు చేయడం ద్వారా జయప్రదం చేయాలని ప్రజలకి పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో ఓర్వకల్లు మండలం నాయకులు,సర్పంచ్లు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, తిప్పాయిపల్లె గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

## ఆలయాన్ని నిర్మించాను

# దర్శనానికి ఆటంకం కల్పిస్తున్నారు

### : గిరినాథ్ ప్రకాష్



**చౌడేపల్లి ప్రతినిధి నవంబర్ 09 రిపబ్లిక్ న్యూస్** మూడు దశాబ్దాల క్రితం దేవస్థానం అభివృద్ధికి సొంత నిధులతో కృషి చేశానని దర్శనానికి ఆటంకం కల్పిస్తున్నారు అంటూ పారిశ్రామికవేత్త గాండ్లపల్లి వాసి అయిన గిరినాథ్ ప్రకాష్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఈ మేరకు గాండ్లపల్లి అభయ ఆంజనేయస్వామి ఆవరణలో ఆయన ప్రసంగిస్తూ 1990లో కొద్దిపాటి విస్తీర్ణంలో ఉన్న అభయ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఎలాగైనా నిర్మించాలని తపన తనలో వచ్చిందన్నారు తన కోరికను తండ్రితో తెలిపానని అప్పట్లో స్తోమత లేక అలాగే ఉండిపోయానన్నారు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగం వచ్చిన తర్వాత తన కోరిక నెరవేర్చుకోవాలని నెపంతో స్వామివారికి ఆలయ నిర్మాణం అంచెలుగా చేపట్టి తాను సైతం పరిశ్రమ స్థాపించి ప్రయోజకుడు అయిన తర్వాత ఆలయాన్ని సంపూర్ణంగా నిర్మించాలని తలచి పూర్తి చేశానన్నారు. అయితే తమ గ్రామంలోనే ఒక వ్యక్తి గర్భాలయం నిర్మాణ పనులు చేపడుతున్నానని తెలియడంతో పూర్తి బాధ్యతలు అతన్నే తీసుకోవాలని తెలిపినప్పటికీ తర్వాత తానే నిర్మించాలని అనడంతో ఆలయాన్ని పూర్తి చేశాను అన్నారు ప్రతి ఆదివారం పౌర్ణమి రోజున తన ఆధ్వర్యంలోనే అప్పటినుంచి స్వామివారికి వివిధ కైంకర్యాలు నిర్వహించేవారుమన్నారు అంతేకాకుండా హనుమాన్ జయంతి అత్యంత వైభవంగా జరిపే వారమని ఆయన పేర్కొన్నారు అయితే తమ గ్రామంలోనే ఒక వ్యక్తి స్వామివారి దర్శనానికి ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు తాను దర్శనానికి వస్తే ఆలయ గేట్లు వేసి తాళాలు ఇచ్చేవారు కాదని తాను కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఉన్నానని స్వామివారి దర్శనానికి వస్తే తాళాలు వేసి తాళం చెవి తనకు ఇవ్వకుండా వెళ్లే వారన్నారు ఈ విషయమై గ్రామస్తులతో సంప్రదింపులు జరుపుతున్నానని స్వామివారి దర్శన భాగము కల్పించి పూజాది కార్యక్రమాల్లో పాలుపంచుకునేలా చేయాలని అభయ ఆంజనేయ స్వామిని కోరుకుంటున్నాను అని ఆయన వివరించారు అనంతరం జరిగిన ఉదంతా నంతా గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వేలూరు రమణయ్య, కంపల్లి రామస్వామి ,నూనె దామోదర్, కంపల్లి సరస్వతమ్మ ,కంపల్లి సుబ్రహ్మణ్యం ,గంగులప్ప, జే రమణ, జనార్ధన్ రాజు , వెంకటరెడ్డి గాండ్లపల్లితో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు పాల్గొన్నారు.





## బెస్త మరియు రెడ్డి కార్తీకమాస వనభోజన మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని

**ఓర్వకల్ ప్రతినిధి, నవంబర్ 9, (రిపబ్లిక్ న్యూస్)** ఆదివారం,కర్నూలు నగరంలోని శేషన్న నగర్ లో బెస్త కార్తీక వనభోజనం మహోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కాటసాని రాంభూపాల్ రెడ్డి అనంతరం కర్నూలు %GRC% కన్వెన్షన్ హాల్ నందు నిర్వహించిన రెడ్డి కార్తీక వనభోజన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని కార్తీక వనభోజన మహోత్సవముల విశిష్టతను తెలియజేసిన వైయస్సార్సీపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మరియు పాణ్యం మాజీ ఎమ్మెల్యే శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి



## నేడు మాజీ మంత్రి పెద్దిరెడ్డి మండల పర్యటన



**పుంగనూరు ప్రతినిధి నవంబర్ 09 రిపబ్లిక్ న్యూస్** రాష్ట్ర మాజీ మంత్రి పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈనెల 10న మండలంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణ్ రెడ్డి తెలిపారు స్థానికంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏ కొత్తకోట, చారాల ,దుర్గ సముద్రం, చౌడేపల్లి, చింతమకులపల్లి, పుదిపట్ల, పెద్ద ఎల్లకుంట్ల, వెంగళపల్లి, దిగువపల్లి పంచాయతీ గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పాల్గొంటారని వైసీపీ నాయకులు ప్రజలు కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ద్విచక్ర వాహనం బోల్తా ఇద్దరికి గాయాలు



**పుంగనూరు ప్రతినిధి నవంబర్ 09 రిపబ్లిక్ న్యూస్** ద్విచక్ర వాహనం బోల్తా పడి ఇద్దరు గాయపడిన సంఘటన పుంగనూరు పట్టణ సమీపంలోని భగత్ సింగ్ కాలనీ వద్ద చోటుచేసుకుంది .స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి .పట్టణంలోని గోకుల్ సర్కిల్లో నివాసమున్న ఆరిఫ్ (26), శ్రావణ్ (28) ఇద్దరు ద్విచక్ర వాహనంపై చౌడేపల్లి నుంచి పుంగనూరు కి వస్తుండగా పట్టణ సమీపంలోని భగత్ సింగ్ కాలనీ వద్ద ద్విచక్ర వాహనం బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డారు .స్థానికులు గమనించి 108కు సమాచారం అందించి క్షతగాత్రులను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు .ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కార్తీక దీపోత్సవానికి పుష్కరణి ముస్తాబు



**పుంగనూరు ప్రతినిధి నవంబర్ 09 రిపబ్లిక్ న్యూస్** పుంగనూరు పట్టణంలోని కోనేటిపాళెం వద్ద గల శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ పుష్కరణిలో ఈనెల 17న కార్తీక సోమవారం చివరి రోజు వేలాది మంది దీపాలు పెట్టి దీపోత్సవం నిర్వహించనున్నారు. ఆదివారం హిందూజాగరణ సమితి సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ పుష్కరణిలో పూడికతీత, నీటిని తొలగించే పనులు ప్రారంభించారు. గత ఏడాది ఒక యువకుడు పుష్కరణిలో ఆత్మహత్య చేసుకోవడంతో పుష్కరణిలో పుణ్యావాచన కార్యక్రమాలు నిర్వహించి, శుద్ధి చేసి, మంచినీటిని పుష్కరణికి తరలించి, వేద పండితులచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవంలో పాల్గొనేందుకు వేలాది మంది సిద్ధమౌతున్నారు. కన్నుల పండుగగా , అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవం పుష్కరణిలో నిర్వహించడం ఏటా ఆనవాయితీగా జరుగుతోంది.

# ఆర్యవైశ్యులు ఎన్నికల్లో మా కుటుంబాన్ని ఆశీర్వదించారు

**ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటాం "అయ్యా" అని గౌరవంగా పిలిచేది ఆర్యవైశ్యులనే**

**నంద్యాలలో ఆర్యవైశ్యులు, మైనార్టీలు అన్నదమ్ములుగా ఉంటారు : ఎన్ఎండి ఫిరోజ్**

**ఆర్యవైశ్యులు గెలుపోటములను శాసిస్తారు:కండే శ్యామ్**






**నంద్యాల బ్యూరో నవంబర్ 9 (రిపబ్లిక్ న్యూస్) :** నంద్యాల పట్టణంలో ఆర్యవైశ్యులు అందరూ ప్రతి ఎన్నికల్లో మా కుటుంబాన్ని ఆదరిస్తున్నారని నంద్యాల జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పేర్కొన్నారు. కార్తీక్ మాసం సందర్భంగా శ్రీ ప్రథమ నంది దేవాలయంలో శ్రీ బాలాజీ కాంప్లెక్ ఆర్యవైశ్య సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక్ వన భోజనాలకు ఎన్ఎండి ఫిరోజ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో ఉన్న ఆర్యవైశ్యులు అందరూ ఎన్నికల్లో మా కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్నారని అన్నారు. ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా మా నాన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్, నేను ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామన్నారు. మా కుటుంబం రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఆర్యవైశ్యుల ఇళ్ల మధ్యనే మా ఇళ్లు ఉందని గుర్తుచేశారు. స్నేహితులు, బంధువులు ప్రతి ఒక్కరు పద్మావతి నగర్ కానీ ఇతర ప్రదేశాల్లో మంచి ఇల్లు కట్టుకో అని సలహా ఇచ్చినా ఆర్యవైశ్యుల ఇళ్ల వద్ద ఉండే గొప్పతనం మాకు తెలుసన్నారు. సమాజంలో" అయ్యా" అని గౌరవంగా పిలిచేది ఒక్క ఆర్యవైశ్యులకే దక్కుతుందన్నారు. నంద్యాలలో ఉన్న పెద్ద, పెద్ద ఆర్యవైశ్యులు అందరూ అన్నదమ్ముల వలె ఉంటామన్నారు. ఆర్యవైశ్యులు సమస్యలు ఎదురైతే మీలో ఉన్న వారి దృష్టికి తీసుకొని వస్తె సమస్యలు పరిష్కరించడానికి ముందుంటున్నారు. మా కుటుంబం రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఆర్యవైశ్యులు ఆదరించడం వల్లా మా నాన్నకు నాలుగు సార్లు మంత్రి పదవులు రావడానికి మీ పాత్ర ఉందన్నారు. గత ఎన్నికల్లో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగాయని ఆర్యవైశ్యులు తెలుగుదేశంపార్టీకి 99 శాతం ఓట్లు వేసి గెలిపించారని అందరికీ పేరుపేరున ధన్యవాదాలు తెలిపారు. కార్తీక్ మాసంలో ఆర్యవైశ్యులు కుటుంబసభ్యులతో కలిసిరావడం సంతోషంగా ఉందన్నారు. కార్తీక్ మాసం వనభోజనాలు కు రావడం ఆనందంగా ఉందని అందరికీ ఆ శివపార్వతుల ఆశీర్వాదాలు కలగాలని కోరారు. నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు కౌన్సిలర్ టిడిపి నాయకులు ఖండే శ్యాంసుందర్లాల్ మాట్లాడుతూ నంద్యాలలో ఏ ఎన్నికలో అయినా అభ్యర్థి గెలుపు ఓటములను ఆర్యవైశ్యులు శాసించే స్థాయిలో ఉన్నారన్నారు ఆర్యవైశ్యుల మందిరం సంఘటితంగా ఉన్నామని ఎవరికి ఏ సమస్య వచ్చినా ఎన్ఎండి ఫరూక్ నాయకత్వంలో పరిష్కరించుకుంటామన్నారు అనంతరం నిర్వాహకులు ఎన్ఎండి ఫిరోజ్ ని , శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ మేడా మురళీధర్ ను ఖండే శ్యామ్ ఆర్యవైశ్య నాయకులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బింగుమల్ల శ్యామ్ సుందర్ గుప్తా, ఇల్లూరి లక్ష్మయ్య , భీమిశెట్టి మనోజ్ కుమార్ , నంద్యాల నాగేంద్ర , మిరియాల చంద్రమౌళి , బింగుమల్ల సుబ్బలక్ష్మయ, మున్సిపల్ వైస్ చైర్మెన్ గంగిశెట్టి నాగ శ్రీధర్, కశెట్టి చంద్ర శేఖర్ , విజయ్ కుమార్ , నిచ్చెనమెట్ల సుబ్బరామయ్య , తదితరులు పాల్గొన్నారు.

## చిత్రకారుని కుటుంబానికి 50,000 ఆర్థిక సహాయం

**నంద్యాల నవంబర్ 09 (రిపబ్లిక్ న్యూస్)** నంద్యాలలో చందు ఆర్ట్స్ గా సుపరిచితుడైన చందు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కుటుంబ యజమాని మరణంతో చందు కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకోవలన్న సంకల్పంతో నంద్యాల చిత్రకారులు సంఘం అధ్యక్షులు పోసా శ్రీను పిలుపు మేరకు నంద్యాల సీనియర్ చిత్రకారులు శివరాముడు,వాసు ఆర్ట్స్,ధనరాజ్,బాబీ,నరసింహ,విజయ్ ఆర్ట్స్,ఓబులేసు, రాజారామ్ తరుణ్,జయరాం,ప్రభాకర్,రాజా ఆర్ట్స్ తదితరులు తమ వంతుగా ఆ కుటుంబానికి 50,000 రూపాయలు ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి తమ పెద్ద మనసును చాటుకున్నారు. ఆర్టిస్టులకు నంద్యాల పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుంకన్న తదితరులు పాల్గొన్నారు.



# సంపద సృష్టి జగన్ ను చూసి నేర్చుకోండి

**- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి -చంద్రబాబు హామీలనునమ్మడం అంటే మోసపోవడమే**

**- కూటమి ప్రభుత్వానికి ఓటమి తప్పదు - అభివృద్ధి - సంక్షేమం మరచి వేదింపులకే పరిమితం**







**పుంగనూరు ప్రతినిధి నవంబర్ 09 రిపబ్లిక్ న్యూస్** ఎన్నికల్లో సంపద సృష్టిస్తా....పేదలకు పంచుతా... అని ఊకదంపడు ప్రసంగాలు ఇచ్చిన చంద్రబాబు ఆ సంపద సృష్టి ఎలా ఉంటుందో గత సీఎం వైఎస్.జగన్ ను చూసి నేర్చుకోవాలని మాజీ మంత్రి , ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో వైద్యకళాశాలల ప్రైవేటీకరణపై వైఎస్సార్‌సిపి నిరసన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ సంపద సృష్టించడం అంటే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటీకరించడమా...? అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగంలో ఆస్తులను అభివృద్ధి పరచి, వాటి ద్వారా సంపద పెంచాల్సింది పోయి, వేల కోట్ల ప్రభుత్వ సంపద ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు, ధనికుల మధ్య ఆర్థిక అసమానతలు తొలగించడంలో ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన కృషి ప్రశంసనీయమన్నారు. దీనిని దేశం వెహొత్తం గుర్తించిందని కొనియాడారు. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా ప్రజలకు అందించిన ఘనత వైఎస్.జగన్‌కు దక్కుతుందన్నారు. దీనిపై ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ ప్రజల మధ్య విబేదాలు సృష్టించిందని విమర్శించారు. దీనిపై జగన్ మాట్లాడుతూ తాను పేదల పక్షాన ఉన్నానని, ఇది క్లాస్‌వార్ అని ఆయన సీఎంగా ఉన్నప్పుడే ప్రకటించారని గుర్తు చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు క్లాస్‌వార్ ఏమిటో చేతల్లో నిరూపిస్తున్నారని ఎద్దేవ చేశారు. పేదల కోసం జగన్ నిర్మించిన 17 వైద్య కళాశాలలను సంపన్నులకు కట్టబెట్టి, పేద విద్యార్థులకు తీరని ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమల పేరుతో విలువైన భూములను కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడం , సంపదను దోచిపెట్టడం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో చంద్రబాబు హామిలు- ఇచ్చారంటే , అధికారంలోకి వచ్చాక వాటిని ప్రక్కన బెట్టి ప్రజలను మోసం చేయడమేనన్న విషయం మరో సారి స్పష్టమైందని అన్నారు. పేదల ఆర్థిక అభివృద్ధికి దోహదపడే పథకాలను జగన్ అమలు చేస్తే.....చంద్రబాబు హామిలతో మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం రాకతో ప్రతిపక్షంపై అక్రమ కేసులు పెట్టి వేటాడటం, వేదించడం విధిగా పని చేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ప్రజా ఉధ్యమం తప్పదని హెచ్చరించారు. ఈనెల 12న జరగనున్న నిరసన ర్యాలీకి ప్రతి ఒక్కరు వేల సంఖ్యలో పాల్గొని , జయప్రదం చేయాలని పెద్దిరెడ్డి కోరారు. ఈ సమావేశంలో మాజి ఎంపి రెడ్డెప్ప, వైఎస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, కొండవీటి నాగభూషణం, శ్రీనాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా , ఎంపిపి భాస్కర్‌రెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ కన్వీనర్ ఫకృద్ధిన్‌షరీఫ్, జిల్లా వక్ఫ్బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, జెడ్పిటిసి దామోదర్‌రాజు, పార్టీ నాయకులు ఆవుల అమరేంద్ర, చంద్రారెడ్డి యాదవ్, సంపల్లి బాబు, ఖాదర్, రాజేష్, తేజ తదితరులు పాల్గొన్నారు.

## రాయికల్ వివేకవర్ధిని పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రాయికల్ పట్టణం, నవంబర్ 09, ( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం వివేకవర్ధిని ఉన్నత పాఠశాల 2002- 2003 పదవ తరగతి విద్యార్థులు 22 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, ప్రధానోపాధ్యాయులు కైరం సత్యం, పాఠశాల యాజమాన్యం కట్కాము భూమేశ్వర్, పొన్నం రమేష్, ఉపాధ్యాయులు కుందారపు శ్రీనివాస్, రవికుమార్, రమేష్, మహేష్, రాజ్ కుమార్, మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## త్వరలో రాయికల్ కొత్త మున్సిపల్ భవనం నుండి అధికార కార్యకలాపాలు




**రాయికల్ పట్టణం,నవంబర్ 09, ( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో మునిసిపాలిటీ ఏర్పడి ఆరు సంవత్సరాల అయిపోయిన ఆరు సంవత్సరాలు తరువాత నూతన బిల్డింగు ఏర్పాటు చేశారు ఒక కోటి 20 లక్షలతో ఈ భవనం నిర్మాణం జరిగింది గథ కొన్ని రోజుల నుండి రాయికల్ జగిత్యాల్ మెయిన్ రోడ్ లో గల పోస్ట్ ఆఫీస్ తర్వాత అద్దె భవనములో 12000 కిరాయితో ఉండాలని అప్పటి చైర్మన్ మోర హనుమాన్లు రోడ్ సైడ్ గా ఉంది అని అక్కడ నుండి కార్యకలాపాలు కొనసాగించారు ఈ మధ్యలో భవనం నిర్మాణం పూర్తి అయింది మరి కొద్ది రోజుల్లో కొత్త భవనం నుండి కార్యకలాపాలు సాగిస్తారని 26 జనవరి రోజున ప్రారంభించిన ఈ భవనం పనులు కాక మార్చలేకపోయామని అప్పటి చైర్మన్ హనుమాన్లు తెలిపారు త్వరలోనే ఈ భవనం నుండి కార్యకలాపాలు కొనసాగిస్తామని మున్సిపాలిటీ అధికారులు తెలిపారు

## జగిత్యాల రాయికల్ బస్సులు ఏడు గంటల మధ్యలో రెండున్నరగంటలకు వరకు బస్సు లేదని

**రాయికల్ పట్టణ బిజెపి మాజీ అధ్యక్షులు కల్లెడ ధర్మపురి ఆరోపణ**




**రాయికల్ పట్టణం, నవంబర్ 09, ( రిపబ్లిక్ న్యూస్)** జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి రాత్రి 7 గంటలకు బస్సు నడుపుతున్నారని తర్వాత కొత్త బస్సు 9:30కు బస్సు ఉందని మధ్యలో 2:30 గంటలు బస్సు లేదని రాయికల్ పట్టణ మాజీ బిజెపి అధ్యక్షులు కల్లెడ ధర్మపురి ఆరోపిస్తున్నారు కొత్తగా బస్సు తొమ్మిదిన్నరకు జగిత్యాల నుండీ రాయికల్ వరకు బస్సు ఉండగా మధ్యలో రెండున్నర గంటలు బస్సు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వక్తం చేసారు జగిత్యాల నుండి రాత్రి 7:30కు ఒకటి ఎనిమిదిన్నరకు ఒక బస్సు తప్పనిసరిగా నడిపించాలని ఆర్టీసీ అధికారులను కోరారు ఎందుకండి ప్రయాణికుల మీద ఆర్టీసీ అధికారులు ఎందుకు కక్ష తీర్చుకుంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పుడు కొత్తగా ప్రవేశపెట్టిన జగిత్యాల నుండి రాయికల్ వరకు బస్సు నడపడం 9:30 బస్సు నడపడం శుభసూచకం కానీ జగిత్యాల నుండి రాయికల్ కు ఏడున్నరకు ఒకటి ఎనిమిదిన్నరకు ఒకటి బస్సు ఉండాలని ఆయన కోరారు మధ్యలో రెండున్నర గంటలు ప్రయాణికులు బస్సు కొరకు జగిత్యాల కొత్త బస్టాండ్ లో పడిగాపులు కాస్తున్నామని తప్పనిసరి రాయికల్ బస్టాండులో బస్సుల నడిచే పట్టికను ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

**జిల్లా కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు వసీం**





**కోరుట్ల టౌన్, నవంబర్ 09 (రిపబ్లిక్ న్యూస్)** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ ఉపాధ్యక్షుడు వసీం ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో 68,69,70 బూత్ లలో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు, రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావులతో కలిసి జిల్లా కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు వసీం తదితర నాయకులు ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు వసీం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముస్తాక్ అహ్మద్ (మున్ను), ఆమేర్, రిహాన్, అక్బర్, అబ్బు, ఖయ్యూం, కప్తాన్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆస్తులను కాపడటం బాధ్యతగా భావించాలి..

## జగిత్యాలలో మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి మీడియా సమావేశం

**రాయికల్ పట్టణం,నవంబర్ 9, ( రిపబ్లిక్ న్యూస్)**

నా ప్రజా జీవితంలో నా బాధ్యత నిర్వాహణలో భవిష్యత్‌కు ఉపయోగపడేలా ఎస్సారెస్పీ ధరూర్ క్యాంపు ఆస్తులను పరిరక్షించాను...
దేవాదాయ ఆస్తులను సైతం కాపాడాను..
మున్సిపల్ ఆస్తులను ప్రభుత్వ ఆస్తులను భావించి కాపడటం బాధ్యతగా భావిస్తున్నా...
1952 లో జగిత్యాల పట్టణంలో పెట్రోలు, డిజిల్, కిరోసిన్ కోసం ఔట్‌లెట్ ఏర్పాటు కోసం 20 గుంటల స్థలం వివాదంపై కిబాలపై జరిగిందని డ్యాక్యుమెంట్ తెరపైకి వచ్చింది...
దీనిపై అనేక అనుమానాలు కూడా ఉన్నాయి..
దారం వీర మల్లయ్య కు స్థలం వినియోగం కోసం ఇచ్చారు..
1964 స్థల వివాదం తలెత్తింది.. అప్పుడు వారు ఓనర్‌షిప్ దాఖలు చేయలేదు..
1975 వరకు కిబాల పత్రం తెరమీదకు రాలేదు ఆ తర్వాత జిరాక్స్ పత్రం తెచ్చారు..
కిబాల ద్వారా జరిగిందని డ్యాక్యుమెంట్ తెరకెక్కించారు.. దీనిపై అనేక అనుమానాలు ఉన్నాయి..
దార వీరమల్లయ్య ఉన్నాన్ని రోజులు కిబాల ఎందుకు తెరమీదకు రాలేదు..
ఆయన చనిపోయిన తర్వాత మాత్రమే కిబాల పత్రం వచ్చిందంటే అనుమానాలకు తావిస్తుంది..
అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా యాజమాన్య హక్కులపై ఏ కోర్టులోనూ ప్రయత్నం చేయలేదు..
డివిజన్ బెంచ్ జడ్జిమెంట్‌లో చట్టపరంగా చర్యలు తీసుకునే వరకు కొనసాగించవచ్చని తీర్పుచెప్పారు..
1975 తర్వాత వారసులు కిబాల తెరమీదకు తెచ్చారు..
ఎక్కడా కూడా ఓనర్ షిప్‌పై ప్రయత్నాలు చేయలేదు..



జిరాక్స్‌పై అభిప్రాయం వ్యక్తం చేయటం సాధ్యం కాదని హైకోర్టు వెల్లడించింది...
మంచాల కృష్ణ ఒరిజనల్ కిబాలను హైకోర్టుకు, డివిజన్ బెంచ్‌కు దాఖలు చేయలేదు..
కోర్టులో కేసు గెలువాలంటే ఒరిజనల్ డ్యాక్యుమెంట్ దాఖలు చేయాలి. ఎందుకు చేయలేదు
హైదరాబాద్ లాగా హైడ్రా ఉంటే ఇప్పటికే కూల్చేవారు..
వేములవాడలో కోర్టు ఇంజక్షన్ ఉన్నా కోట్టెశారు..
కరీంనగర్‌లోనూ స్మితా సబర్వాల్ తొలగించాలి..
యాజమాన్యపు హక్కులు లేని ఆస్తిని ఇతరులకు ఎలా అమ్ముతావు..
అమాయకులకు యాజమాన్యపు హక్కు లేకుండానే కొంత ఆస్తిని అమ్మాడు..
దారం వీరమల్లయ్యకు ఇవ్వబడింది.. ఇది వారసత్వపు ఆస్తి కాదు..సీఎం రెవంత్‌రెడ్డి హైడ్రా ద్వారా రూ.60 వేల కోట్ల ఆస్తులను చేజిక్కించికుంది..
-రూ.100 కోట్ల ఆస్తిని చేజిక్కించుకోవాలి...
వీరమల్లయ్య ఉన్నన్ని రోజులు కిబాల తెరమీదికి రాలేదని వాస్తవం కాదా?
1952లో ఇస్తే కిబాలలో 1958లో రాశారు..
మున్సిపల్ అధికారులు కుమ్మక్కయ్యారు.. అందరిపై చర్యలు తీసుకోవాలి..
అండదండలు ఉన్నాయని బెదిరిస్తున్నాడు..
మంచాల కృష్ణ దగ్గరకు రాత్రి పూట పోలేదు..
ఆర్యావైశ్య సంఘం మద్దతు కోసం ఆయన వద్దకు వెళ్లాను..
అందుకు ముందు ఆయన పై రెండు సార్లు ఫిర్యాదు చేశాను..
జనరేటర్ ప్రమాదకరంగా ఉందని ఫిర్యాదు చేశాను...
జీవన్‌రెడ్డి మంచాల కృష్ణ ఇంటికి వెళ్లాడని పేర్కొనటం విడ్డూరంగా ఉంది..
ఎమ్మెల్యే వారి తాతలు కొనుక్కున్నారని సర్టిఫికెట్ ఎలా ఇస్తారు
మీరు డాక్యుమెంట్ చూశారా ఏ పర్పస్ కి ఇచ్చారు ఏంటి మీరు కలెక్టర్ గారు విచారణ కమిటీ వేశారు విచారణ కమిటీ విచారణ చేస్తుంది
ఒక ఎమ్మెల్యే గారు 70 సంవత్సరాల క్రితం వాళ్ల తాతలు ముత్తాతలు కొన్నారని చెప్పడం అనేది విచారణ కమిటీని ప్రభావితం చేస్తుందా చేయదా
మీరు విజన కమిటీని ప్రభావితం చేసే ప్రయత్నం చేస్తున్నారు
ఇదేనా ఒక ఎమ్మెల్యే బాధ్యత మీరే సర్టిఫికెట్ ఇస్తే ఇంకేముంది
విచారణ కమిటీని ప్రభావితం చేయాలనే ఒక ఆలోచన తోని అనుకూలంగా మల్చుకునే ప్రయత్నం
మున్సిపల్ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారు?
సత్యవంతునివి కిబాల ఒరిజనల్‌ను ఎందుకు సమర్పించలేదు...
ఎమ్మెల్యే ఇప్పటికైన వాస్తవాలు పరిశీలించాలి..
జడ్జిమెంట్ కాపి, కిబాల కాపిని తెప్పించుకుని ఎమ్మెల్యే పరిశీలించాలి..
ఇది 100% మున్సిపల్ రెజ్యూమ్ చేసుకోవాలి చేసుకుంటది

# కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌ను గెలిపించండి..

### జూబ్లీహిల్స్‌లో అభివృద్ధికి బాటలు వేయండి..

### జూబ్లీహిల్స్ రెహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి..

### పొంగులేటి ఆధ్వర్యంలో భారీ ర్యాలీకి విశేష స్పందన..





**,(హైదరాబాద్):నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-**
గత 12ఏళ్లుగా జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించలేదని, ఫలితంగా ఇక్కడ అభివృద్ధి కుంటుపడినందున ఈ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపించాలని జూబ్లీహిల్స్ రెహ్మత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు.
ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా ఆదివారం ఉదయం మంత్రి పొంగులేటి రెహ్మత్ నగర్ డివిజన్‌లోని కార్మికనగర్,బ్రహ్మ శంకర్ నగర్,రామిరెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు,కార్యకర్తలతో మమేకమయ్యారు. సాయంత్రం రెహమత్ నగర్ నుంచి బోరబండ వరకు మంత్రి పొంగులేటి నిర్వహించిన భారీ ర్యాలీకి విశేష స్పందన లభించింది. వేలాదిమంది కాంగ్రెస్ జెండాలు చేతబూని ఈ ర్యాలీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి స్పూర్తిదాయకంగా ప్రసంగిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పొంగులేటి ప్రసంగానికి ప్రజలు భారీగా స్పందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గడిచిన 23 నెలలుగా తెలంగాణ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమాన్ని చూసి జూబ్లీ హిల్స్ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, ఈ ప్రాంతానికి ఎంతో సుపరిచితుడూ, యువకుడైన నవీన్ యాదవ్ కు అండగా నిలిచి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గడిచిన 12 సంవత్సరాల నుంచి ఈ ప్రాంతానికి కాంగ్రెస్ పార్టీ ప్రాతినిధ్యం వహించలేదు.10 సంవత్సరాలు బీఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఈ నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన ఎంఎల్ ఏ ఉన్నాగానీ ఈ నియోజకవర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండిపోయిందన్నారు.
జూబ్లీహిల్స్ నియోజకవర్గం పేరుకే సంపన్నుల నియోజకవర్గం.. వాస్తవానికి ఇక్కడ మెజారిటీగా ఉన్నది బడుగు,బలహీన, పేదలు నిరుపేదలే.వీళ్ల సంక్షేమాన్ని పది సంవత్సరాలలో అధికారంలో ఉన్న బీఆర్ ఎస్ ఏనాడూ పట్టించుకోలేదని మంత్రి విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వ పనితీరును గుర్తించి జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీని అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించాలని మంత్రిగారు అందరికీ పేరు పేరున విజ్ఞప్తి చేశారు.బ్యాలెట్‌లో 2వ నెంబరు కలిగిన
కాంగ్రెస్ పార్టీ హస్తం గుర్తుకు ఓటు వేసి మీ సంక్షేమానికి,కాంగ్రెస్ పార్టీ విజయానికి బాటలు వేయాలని,ఈ ప్రాంతప్రజలకు ఇంతకంటే మంచి అవకాశం రాదని ఆయన అన్నారు.

# హైదరాబాద్ వ్యక్తి సహా ముగ్గురు ఉగ్రవాదుల అరెస్ట్

## ఏడాదిగా గుజరాత్ ఏటీఎస్ నిఘా

**న్యూఢిల్లీ :నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-**
దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు కుట్ర పన్నుతున్న ముగ్గురు ఉగ్రవాదులను అహ్మదాబాద్‌లో గుజరాత్ యాంటీ-టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) అరెస్టు చేసింది. గత ఏడాది నుంచి నిందితులపై నిఘా పెట్టిన గుజరాత్ ఏటీఎస్, ఆయుధాలు సరఫరా చేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకుంది. విచారణ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్రదాడులకు వీరు ప్రణాళిక చేస్తున్నట్టు గుర్తించింది. నిందితుల వద్ద నుంచి రెండు గ్లోక్ పిస్టల్స్, ఒక బెరెట్టా పిస్టల్, 30



బుల్లెట్లు, 4 లీటర్ల ఆముదం నూనెను స్వాధీనం చేసుకుంది.నిందితుల్లో ఒకడైన అహ్మద్ మొహియుద్దీన్ హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి అని గుజరాత్ డీఐజీ సునిల్ జోషి తెలిపారు. మరో ఇద్దరు నిందితులు ఆజాద్ సులేమాన్ షేక్, మొహమ్మద్ సుహెల్ సలీంఖాన్ ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందినవారని పేర్కొన్నారు. అహ్మద్ మొహియుద్దీన్ ఇప్పటికే పలు ఉగ్రకార్యకలాపాల్లో పాల్గొన్నాడని తెలిపారు. అహ్మదాబాద్‌కు అతడు వస్తున్నట్టు సమాచారం అందడంతో నిఘా పెట్టారు. అదాలజ్ టోల్ ప్లాజా సమీపంలో అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు.

# డబుల్ బెడ్‌రూం లబ్ది దారులకు ఇబ్బందులకు గురి చేస్తున్న అధికారులు




**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-, (హిమాయత్ నగర్):** మేడ్చల్ మల్కాజ్గిగి బహదూర్ పల్లి ప్రాంతంలోని డబుల్ బెడ్రూం లబ్బిదారులకు ప్రభుత్వ అధికారులు వేదిస్తున్నారని డబుల్ బెడ్రూం జాయింట్ కమిటి చైర్మన్ నర్సింగ్ రావు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ విలేకరుల సమావేశంలో తెలిపారు.గత కొన్ని రోజుల క్రితం అహ్మద్‌గూడలో జిల్లా కలెక్టర్ సందర్శించి 18 సమస్యలను గుర్తించి, వాటిని త్వరగా పరిష్కరిస్తానని వాగ్దానం చేశారు.కానీ ప్రజలు ఆశించిన ఆశలకు కన్నీరే మిగిలింది.ఆర్‌డబ్లూఏ (రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్) ఎలక్షన్లు నిర్వహించి సుమారు 10 లక్షల ప్రజాధనం దుర్వినియోగమైంది. ఇప్పుడు సెంట్రల్ కమిటీ ఎలక్షన్లు అంటూ ఆర్‌డబ్లూఏ సంబంధించి రెండు పేపర్లు రిలీజ్ చేశారు. వాటిలో భూగర్భ డ్రైనేజ్ సిస్టమ్, మంచినీటి పైపుల మరమ్మత్తు-నిర్వహణ, స్ట్రీట్ లైట్స్ కరెంట్ బిల్లు,పార్క్ మెయింటెనెన్స్,ఎస్టీపీ మెయింటెనెన్స్, ఏఎంసీలు ఉన్నాయి. ఇవి లబ్దిదాలకు వర్తిస్తే ప్రతి లబ్ధిదారునికి నెలకు 3,000 నుంచి 5,000 రూపాయల వరకు భారం పడుతుంది.ఈ అన్యాయానికి వ్యతిరేకంగా జాయింట్ యాక్షన్ కమిటీ మేడ్చల్ హౌసింగ్ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించింది. అక్కడున్న హౌసింగ్ అధికారులు,సీడీఎంఏ అధికారులు ప్రశ్నించగా వీటిని పునర్విచారించి సమాధానం ఇస్తామని పేర్కొన్నారు.తక్షణమే ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూందారులకు ఆదుకోవాలని కోరారు. సమావేశంలో డబుల్ బెడ్‌రూ జాయింట్ యాక్షన్ కమిటి మెంబర్లు మురహరిపల్లి, పెంటయ్యా,సందీప్, కుమార్,వినోద్ కుమార్,పెంటయ్య, శేఖర్,శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్ చారి, అహ్మద్,వెంకటేష్, నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మగువలు మేచ్చే అందమైన చీరలకు నిలయం శ్రీ అష్టలక్ష్మి సిల్క్స్



**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):-(కొత్తపేట):** కొత్తపేట్ ఆర్కేపురం డివిజన్ పరిధి లోని వాసవి కాలనీ రోడ్ నెంబర్ 11 లో ఇరో కిడ్స్ స్కూల్ పక్కన గోపిక ఫ్యాషన్ స్టూడియో ఎదురుగా శ్రీ అష్టలక్ష్మి సిల్క్స్ నూతనంగా ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ,మావద్ద ఇప్పుడు ట్రెండింగ్ లో ఉన్న బిగ్ బ్రో కిట్, పట్టుచీరలు,సెమీ పట్టు చీరలు,టిష్యూ సారీ, పెళ్లిళ్లకు శుభకార్యాలకు వివిధ రకాలైన శారీలు ఎంతో క్వాలిటీతో తామే తయారు చేసి అందుబాటు ధరల్లో విక్రయిస్తున్నామని అన్నారు. మ్యానుఫ్యాక్చరర్ వచ్చేసి ధర్మవరం అని చెప్పారు.అక్కడ రెండు బ్రాంచ్ లు ఉన్నాయి అని,ఇక్కడ కూడా మహిళలకు మంచి క్వాలిటీ గల చీరలు విక్రయించేందుకు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసామని అన్నారు. కావున ఒక్కసారి ఇక్కడికి విచ్చేసి మీకు నచ్చితే చీరను ఎంపిక చేసుకోవాల్సిందిగా కోరారు.మరిన్ని వివరాల కొరకు 9844030830, 8217669200 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా సూచించారు.ఇక్కడ చీరలు బాగున్నాయని ఒకసారి ఇక్కడికి వచ్చి మీరు కూడా మీకు నచ్చిన చీరను కొనుగోలు చేయాల్సిందిగా అక్కడికి వచ్చిన ఒక కస్టమర్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

# భారీ విజయంతో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతమ్మ గెలుస్తుంది..

### ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ నవీన్ రెడ్డి..

### ఎలారెడ్డి గుడలో 274 నుండి 282 భూత్ ల వరకు విస్తృతంగా ఎన్నికల ప్రచారం..



**నవంబర్9 (రిపబ్లిక్ న్యూస్):- (జూబ్లీహిల్స్):**



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతమ్మ కేసీఆర్ ఆశీర్వాదంతో అదేవిధంగా జూబ్లీహిల్స్ ప్రజల మద్దతుతో భారీ విజయాన్ని సాధిస్తారని,ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని ప్రజా వ్యతిరేకత అంటే ఏమిటో ఈ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రుచి చూస్తారని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.ఆదివారం రోజు ప్రచారానికి చివరి రోజు కావడంతో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో భాగంగా మాగంటి సునీతమ్మ గెలుపు కొరకు సోమాజిగూడ డివిజన్ లోని 274 నుండి 282 బూతుల వరకు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించారు.ఈ ప్రచారంలో బీఆర్ఎస్ నాయకులు రామక్రిష్ణ, కానుగు అనంతయ్య,ఈశ్వర్ రాజు,తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,శేఖర్ పంతులు,రవీందర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి, బాబురావు,భూత్ ఇన్చార్జిలు స్థానిక నాయకులుతదితరులు పాల్గొన్నారు.

# అనధికారికంగా మీటర్లు బిగింపు




## వ్యక్తిగతంగా వసూలు చేస్తున్న విద్యుత్ అధికారులు...

## వీటి ముడుపుల లెక్కలను విద్యుత్ శాఖ తేలుస్తుందా..?

## అడ్డదారిలో నష్టం వాటిల్లుతున్నా మత్తు వదలని శాఖ...



అనంతపురం ప్రతినిధి, నవంబర్ 09,(రిపబ్లిక్ న్యూస్):

నగరంలో విద్యుత్ అధికారులు ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారికి అనధికారికంగా విద్యుత్ మీటర్ పెట్టెలను ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. కొందరు వ్యక్తులు నగరంలో ఇనుప బంకులను ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రకాలుగా ఏర్పాటు చేసుకున్న బంకుల యజమానులు విద్యుత్ మీటర్ పెట్టెలకు అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే వాటిని లైన్మెన్ ద్వారా బంకుల యజమానులు అనధికారికంగా విద్యుత్ కనెక్షన్ తీసుకుని మీటరును ఏర్పాటు చేసుకున్నారు. అయితే నగరంలో చెరుకు బండ్లకు, సేవింగ్ సెలూన్లకు, టీ కొట్టు లకు, ఎలక్ట్రీషియన్ బంకులకు, వెల్డింగ్ బంకులకు ఇలా వివిధ బంకులకు అనేక చోట్ల నగరంలో విద్యుత్ అధికారులు విచ్చలవిడిగా బంకులకు విద్యుత్ మీటర్లను బిగించారు. ఒక్కో మీటర్ కు క్యాటగిరి 2 కింద విద్యుత్ మీటర్లను చలానా వెయ్యి నుంచి 1500 దాకా కట్టించుకొని విద్యుత్ మీటర్లను బంకుల యజమానులకు ఇస్తారు. ఇవేవీ పట్టనట్లు లైన్మెన్ ల ద్వారా అసిస్టెంట్ ఇంజనీర్లకు బంకులేజమానుల అనుమతులను పై అధికారికి సిఫార్సు చేయాల్సి ఉంది. అందులో భాగంగా సిఫార్సు చేసిన అనుమతులను ఏఈ సమక్షంలో ఆమోదించిన తర్వాత. బ%శీ%కుల యజమానులకు మీటర్లను అందజేశారు. అయితే నగరంలో వందలకొద్దీ వివిధ ప్రాంతాలలో బంకులను ఏర్పాటు చేసుకొని అనధికారికంగా విద్యుత్ కనెక్షన్లను బంకుల యజమానులు పొందుతున్నారు. ఇవేవీ పట్టనట్లు విద్యుత్ అధికారులు వాటిని ఆసరాగా చేసుకుని లక్షల్లో సొమ్ము చేసుకుని పబ్బం గడుపుతున్నారు. విద్యుత్ పై అధికారులకు మూడుపులు వెళుతుండడంతో వారు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అనధికారికంగా వందలు కొద్ది మీటర్లను అప్పనంగా అందజేసిన విద్యుత్ అధికారులపై ఆ పై స్థాయి అధికారులు నిర్లక్ష్య ధ్వరణలో వ్యవహరిస్తున్నారు.

### ముడుపుల “పబ్బం”లో విద్యుత్ అధికారులు

నగరంలో వందలు కొద్ది ఏర్పాటు చేసిన బంకులకు విద్యుత్ అధికారులు అప్పనంగా మీటర్లను అప్పజెప్పి బంకులే యజమానుల నుంచి ఒక్కో మీటర్ కు 12000 నుంచి దాదాపు 20,000 దాకా వసూలు చేసి వ్యక్తిగతంగా వసూలు చేసుకుంటున్నారు. వసూలు చేసిన మొత్తంలో విద్యుత్ శాఖకు ఒక్క రూపాయి కూడా వెళ్లడం లేదు. దీంతో విద్యుత్ శాఖకు మీటర్లు అందజేసిన మొత్తంలో నష్టం వాటిల్లుతోంది. దీంతో విద్యుత్ ఆదాయానికి గండిపడుతోంది. నగరంలో ఇంత తంతు జరుగుతున్న కూడా ఎస్సీ, డి ఈ తమకు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుండడం గమనార్హం. అందులో భాగంగానే అనధికారికంగా వందల కొద్ది మీటర్లను బంక్ యజమానులకు అందజేసి విద్యుత్ అధికారులు సొమ్ము చేసుకుంటున్నా కూడా విద్యుత్ పై స్థాయి అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.

### మీటర్లు బిగించి వాటాలు పంచుకోండి

నగరంలో బంకులో ఏర్పాటు చేసిన వాటికి వ్యక్తిగతంగా డబ్బులు వసూలు చేసుకున్న విద్యుత్ అధికారులు ఆ మొత్తాన్ని విద్యుత్ శాఖకు అందజేయకుండా వ్యక్తిగతంగా వసూలు చేసుకుని సొమ్ము చేసుకుని లబ్ధి పొందుతున్నారు. నగరంలో ఎస్సీ, డి ఈ నగరంలో కళ్ళు మూసుకొని ప్రయాణం చేస్తున్నారా.... అనధికారికంగా విద్యుత్తు మీటర్లు బిగించుకున్న బంకులు మీకు కనబడవా. మామూల్లో మత్తులోనే మునిగి తేలుతారా...
విద్యుత్ శాఖకు లక్షల్లో ఆదాయం గండు కొడుతున్న కూడా నిద్ర మత్తు వదలరా.... వ్యక్తిగత వసూళ్లకు పాల్పడుతున్న విద్యుత్ అధికారులపై పై స్థాయి అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అనుమానాలకు తావిస్తోంది.
ఇలా ఒక్కో బంకుకు ఒక్కోరేటను ఫిక్స్ చేసి లక్షల్లో దండుకుంటున్నారు. ఇంత తంతు జరుగుతున్న కూడా నిర్లక్ష్య ధోరణలో ఎస్సీ,, డి ఈ వ్యవహరిస్తుండడం ఎంతవరకు సమంజసం.

### నగరంలో లెక్కలు తేల్చండి

నగరంలో ఎక్కడ చూసినా బంకులకు ఒక్కో బంకుకు ఒక్కో రేటు ఉంది ఫిక్స్ చేసి వసూలు చేసుకుంటున్నా అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు. లైన్మెన్ నుంచి
విద్యుత్ ఏఈ వరకు, ఎస్సీ నుంచి డి ఈ వరకు వీళ్లకు నగరంలో బంకులకు బిగించిన వందల మీటర్లకు ఎంత వసూలు చేసేది అనేది ప్రశ్నార్థకమే.. మరి ఇంత డబ్బును వ్యక్తిగతంగా వసూలు చేసుకున్న అధికారులు విద్యుత్తు శాఖకు ఎందుకు అందజేయకుండా ఉన్నారు.
విద్యుత్ శాఖ ఆదాయానికి గండి కొడుతున్న కొందరు అధికారులపై ఎందుకు అధికారులు దృష్టి పెట్టలేకపోతున్నారు. అంటే అనధికారికంగా అందజేసిన విద్యుత్ మీటర్ల వసూళ్ల మొత్తంలో పై అధికారులకు మూడుపులు అందుతున్నాయనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇంత తంతు జరుగుతున్నా కూడా విద్యుత్ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ శాఖకు గండి కొడుతున్న అధికారులపై ఎందుకు చర్యలు చేపట్టలేదు అర్థం కాని పరిస్థితి నగరంలో ఏర్పడింది. వందల మీటర్లకు బిగించిన సొమ్ములో విద్యుత్ శాఖకు ఆ మొత్తంలో కొంతైనా చేరిందో లేదో లెక్క తేలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇవేవీ లెక్కలు చూడకుండా వ్యక్తిగత ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకొని లైన్మెన్ ల నుంచి ఏ ఇళ్ల వరకు విద్యుత్ మీటర్లలో దందా కొనసాగిస్తున్నారు. ఈ మొత్తాన్ని వాటాలకొద్దీ అధికారులు పంచుకొని మింగేస్తున్నారు.

### వేతనాలు వస్తున్నా కూడా వసూళ్లలో మునిగి

వేళ్ళకు వేల రూపాయలు విద్యుత్ అధికారులు తీసుకుంటూ కొందరు అక్రమార్జనలో ప్రయాణం చేస్తున్నారు. విద్యుత్ శాఖలో బంకులకు ఏర్పాటుచేసిన విద్యుత్ మీటర్ల బాగోతం బయటపడింది. దీంతో అధికారిక లెక్కలు తేల్చనున్నారా.... లేక వాటాలు పంచుకోనున్నారా అనేది అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వేలకు వేలు వేతనాలు తీసుకుంటున్న కూడా కొందరు అధికారులు అక్రమార్జనే దేయంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. పై స్థాయి అధికారులు వీటిపై దృష్టి పెట్టలేకపోతున్నారు. కొందరికి అనధికారిక విద్యుత్ మీటర్ల బాగోతం తెలిసినప్పటికీ వాటాలు ఇవ్వడంతో గమ్మ నుండి పోయారు.

### విద్యుత్ శాఖలో తిమింగలాలపై చర్యలు శూన్యం

వందల కొద్ది విద్యుత్ మీటర్లను వివిధ కొట్టులకు బిగించి సొమ్ము చేసుకున్న అధికారులకు విద్యుత్ శాఖ అండదండలతో ఈ తంతు జరుగుతోందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అంటే







### అడ్డదారిలో లైన్మెన్ లు, ఏఈ లు లక్షల్లో సొమ్ము

నగరంలో చిన్న బంకులకు, జ్యూస్ బంకులకు, చెరుకు బండ్లకు, సేవింగ్ సెలూన్ బంకులకు, వెల్డింగ్ బంకులకు ఇలా వివిధ బంకులకు లైన్మెన్ ల ద్వారా ఏఈలతో బంకుల యజమానులు ఏకంగా వందల విద్యుత్ కనెక్షన్లను పొందారు. బంకుల యజమానుల నుంచి లైన్మెన్, ఏఈ లు లక్షల రూపాయలను అడ్డదారిలో సొమ్ము చేసుకుని పోగేసుకున్నారు. క్యాటగిరి 2 కింద లైన్మెన్లు బంకులకు విద్యుత్ మీటర్లను బిగిస్తారు. ప్రాసెస్ ఏదైనా సరే లైన్మెన్ చూసుకుంటాడు. వీరి ద్వారా ఏఈలకు అధిక మొత్తంలో ముడుపులు అందుతాయి. అధికారికంగా విధినిర్వహణ చేపట్టాల్సిన అధికారులు ధనార్జనే ధ్యేయంగా అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు.

కొందరు అధికారులు నగరంలో అక్రమార్జనే ధ్యేయంగా పనిచేస్తున్న వారిపై విద్యుత్ శాఖ ఎందుకు చర్యలు చేపట్టలేకపోతోంది. వ్యక్తిగతంగా కొందరు లైన్మెన్ లు సర్వీసులను ఇస్తూ కూడా ఏ ఈ కనసన్నల్లోనే ఈ భాగోతం జరుగుతుండడం గమనార్హం. అంటే ఏఈలకు లైన్మెన్ ల ద్వారా అధిక మొత్తంలో వసూళ్లు అందుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో అవినీతి తిమింగలాలపై విద్యుత్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ప్రశ్నార్థకమే.. లైన్ మెన్ ల నుంచి ఏ ఈలదాకా కూడా వారు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వీడలేక అక్రమార్చనే ధ్యేయంగా పనిచేస్తున్నారు. మామూళ్లకు అలవాటు పడిన కొందరు ఏఈలు విద్యుత్ కనెక్షన్ కావాలంటే కొన్ని షరతులు విధిస్తూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నారు. రైతులు, వినియోగదారులు ఏ ఈ ల ద్వారా విద్యుత్ పనులు సక్రమంగా జరగకపోగా... ఏఈలు వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కాలయాపన చేస్తూ అధికారులు రైతులను, వినియోగదారులను తమ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి, సంవత్సరాల తరబడి తిప్పుకుంటూ కాలక్షేపం కొనసాగిస్తున్నారు. దీంతో రైతులు, వినియోగదారుల ప్రయాణ ఖర్చు అధిక మొత్తంలో దుర్గినియోగం అవుతోంది. దీని ద్వారా రైతులు, వినియోగదారులు అధికంగా నష్టపోతున్నారు. రోజుల తరబడి విద్యుత్ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్న కొంతమందికి ఏఈలు ఉద్దేశం పూర్వకంగా కక్ష సాధింపు చర్యలు భాగంగా ఇబ్బందులకు గురిచేస్తుండడం ఎంతవరకు సమంజసం. ఇప్పటికైనా వీటిని దృష్టిలో పెట్టుకుని విధి నిర్వహణలో అల్లాసత్వం వీడని అధికారులపై విద్యుత్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాల్సిందే....







printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com